www.udyamakeratam.com
RNI: TGTEL/25/A0273

1వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత:
UDYAMA KERATAM TELUGU DAILY
తెలుగు దినపత్రిక


| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 91 | 16-9-2026 | బుధవారం | పేజీలు: 8 | వెల : రూ.2/- |

# రూ.2 వేలు దాటితే యూపీఐకి 'చార్జీలు'!




- చిన్న చెల్లింపులకు రుసుముల్లేవని కేంద్రం స్పష్టీకరణ
- పెద్ద వ్యాపారి లావాదేవీలపై ఎండీఆర్‌కు అవకాశం
- రేటు ఖరారుపై 22 మంది సభ్యుల కమిటీ కసరత్తు
- 'ప్రజలపైనే పరోక్ష భారం' అంటూ రాహుల్ ఫైర్
- 'చార్జీలు వస్తే మళ్లీ నగదు వైపే' అంటున్న అష్నీర్ గ్రోవర్

దేశవ్యాప్తంగా కోట్లాది మంది నిత్యం వినియోగిస్తున్న యూపీఐ చెల్లింపులపై 'చార్జీల' చర్చ మొదలైంది. రూ.2 వేల వరకు యూపీఐ, రూపే డెబిట్ కార్డు చెల్లింపులపై బ్యాంకులు, చెల్లింపు వ్యవస్థల సంస్థలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎలాంటి రుసుము వసూలు చేయకూడదని కేంద్రం సెప్టెంబర్ 14న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. 4



# ఉస్మానియాకు పూర్వ వైభవం తీసుకురావాలి


## ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారం కోరిన సీఎం రేవంత్

### ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5తో మర్యాదపూర్వక భేటీ

- సిటీ కాలేజ్ పునరుద్ధరణకూ సహకరించాలని విజ్ఞప్తి
- మూసీని 'నైట్ ఎకానమీ' కేంద్రంగా తీర్చిదిద్దుతామని వెల్లడి
- తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ప్రత్యేక ఆహ్వానం

తెలంగాణ వారసత్వ సంపదను కాపాడుకోవడంలో అగా ఖాన్ ఫౌండేషన్ అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5తో మంగళవారం ఆయన మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అగా ఖాన్ ఫౌండేషన్ సహకారంతో ఇటీవలే శాసనమండలి భవనం, కుతుబ్ షాహీ టూంబ్స్‌ను పునరుద్ధరించుకున్నామని గుర్తుచేశారు. మూసీ పరివాహక ప్రాంతంలోని చారిత్రక సిటీ కాలేజ్, ఉస్మానియా హాస్పిటల్ భవనాల పునరుద్ధరణతో పాటు మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో ఫౌండేషన్ భాగస్వామ్యం వహించాలని ఈ సందర్భంగా సీఎం విజ్ఞప్తి చేశారు. ఉస్మానియా హాస్పిటల్ కోసం గోషామహల్‌లో నూతన భవనాన్ని నిర్మిస్తున్నామని, ప్రస్తుతం ఉన్న పాత భవనాన్ని చారిత్రక వారసత్వ సంపదగా తీర్చిదిద్దుతామని సీఎం తెలిపారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో 30 వేల ఎకరాల్లో నిర్మిస్తున్న 'ఫ్యూచర్ సిటీ'లో నిర్వహించే 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు హాజరుకావాలని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్‌ను ఆహ్వానించారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు.

- హైదరాబాద్, సెప్టెంబర్ 15 (ఉద్యమ కెరటం) 2




# తెలుగు రాష్ట్రాలకు 5 లక్షల ఇళ్లు

- ఏపీకి 3 లక్షలు.. తెలంగాణకు 2 లక్షలు
- దేశవ్యాప్తంగా 2 కోట్ల ఇళ్ల కేటాయింపు
- 'ఆవాస్ ప్లస్' యాప్‌తో లబ్ధిదారుల గుర్తింపు
- ఒక్కో ఇంటికి రూ.3 లక్షల వరకు సాయం
- రెండేళ్లలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసే లక్ష్యం

2

# విమర్శలకు భయపడొద్దు



- సోషల్ మీడియాకు తలొగ్గొద్దు
- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

.. వివరాలు 2లో

# మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

## నిజామాబాద్ సీపీ ఎదుట సుశీల రాణి లొంగుబాటు

2






# దేశం నుంచి ఆశించడమే కాదు సేవ చేయండి

జెన్ జెడ్, జెన్ ఆల్ఫాకు నిర్మల పిలుపు

.. వివరాలు 4లో

# '22ఏ' అక్రమాలపై న్యాయ విచారణ జరపాలి

- ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టి వేధిస్తున్నారని కేటీఆర్ ఆరోపణ
- '30 శాతం కమీషన్ల కోసం చిల్లర ప్రయత్నాలు మానుకోవాలి'
- 'ధరణి రక్షణ కవచం.. భూభారతి భూ హారతి' అంటూ విమర్శ
- అసైన్డ్ భూములపై ఎస్సీ, ఎస్టీలకు యాజమాన్య హక్కులు కల్పించాలని డిమాండ్ 3

'రెండేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం.. అక్రమాలన్నీ బయటపెడతాం'



# పసుపు నీళ్ల కేసులో హైకోర్టు కీలక ఆదేశాలు

- నిందితులను వెంటనే అరెస్ట్ చేయొద్దు
- పోలీసులకు హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు
- నోటీసులు ఇచ్చి దర్యాప్తు కొనసాగించాలి
- ఏడేళ్లలోపు శిక్ష సెక్షన్లపై కోర్టు ఆరా
- సుప్రీంకోర్టు మార్గదర్శకాలు పాటించాలని సూచన

2



# అక్కడ ఘనం.. ఇక్కడ భయం

- మజ్లిస్ భయంతోనే విమోచన దినం నిర్వహించడంలేదు
- బీఆర్ఎస్, కాంగ్రెస్‌లపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- బీజేపీ మహిళా మోర్చా ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రి



కర్ణాటక, మహారాష్ట్రల్లో తెలంగాణ విముక్తి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తుంటే తెలంగాణలో మాత్రం కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఎంఐఎం భయంతో నిర్వహించడం లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించనున్న సందర్భాన్ని పురస్కరించుకుని బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం నుంచి మంగళవారం నిర్వహించిన మహిళా శక్తి స్కూటీ ర్యాలీని ఆయన ప్రారంభించి ర్యాలీలో బైక్ నడిపారు. 3

# ఇదొక కపట నాటకం, బూటకపు ప్రకటన

'మసూద్‌పై రివార్డు పెంపుపై భారత్ తీవ్ర స్పందన 4



# రేపు హైదరాబాద్‌కు ఉప రాష్ట్రపతి

- తెలంగాణ విమోచన దినోత్సవానికి సీపీ రాధాకృష్ణన్
- పరేడ్ గ్రౌండ్‌లో జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథి
- విస్తృత ఏర్పాట్లు చేపట్టాలన్న సీఎస్ సంజయ్ జాజు



2

# పంతాలకు పోవద్దు.. పదోన్నతులు కోల్పోవద్దు

- డీఎస్పీలకు డీజీపీ సి.వి.ఆనంద్ సూచన
- అదనపు ఎస్పీలుగా 37 మందికి పదోన్నతులు

2






# మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ..

**సుశీల రాణి లొంగుబాటు.. నిజామాబాద్ సీపీ ఎదుట సరెండర్**

**డివిజన్ కమిటీ సభ్యురాలిగా కీలక బాధ్యతలు**

**ఈ ఏడాది ఇప్పటివరకు 266 మంది లొంగుబాటు**

**అగ్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు నెట్‌వర్క్ బలహీనమైందన్న పోలీసులు**

**తెలంగాణకు చెందిన మరో ముగ్గురు నేతలే అజ్ఞాతంలో ఉన్నట్లు వెల్లడి**

**నిజామాబాద్, సెప్టెంబర్ 15 (ఉద్యమ కెరటం):** దశాబ్దాలుగా మావోయిస్టు ఉద్యమంలో కీలకంగా పనిచేసిన సీనియర్ నాయకురాలు, డివిజన్ కమిటీ సభ్యురాలు నక్కా సుశీల రాణి అలియాస్ లత, లలిత, రేలా, జ్యోతి లొంగిపోయారు. మంగళవారం నిజామాబాద్ పోలీసు కమిషనర్ సాయిచైతన్య ఎదుట ఆమె అధికారికంగా లొంగిపోయారు. సుశీల రాణి లొంగుబాటుతో తెలంగాణలో మావోయిస్టు పార్టీ పునర్నిర్మాణ సామర్థ్యం మరింత దెబ్బతిందని, రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాదం బలహీనపడటంలో ఇది కీలక పరిణామమని పోలీసు అధికారులు పేర్కొన్నారు. 2026లో తెలంగాణ పోలీసుల మావోయిస్టు వ్యతిరేక చర్యల్లో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయని అధికారులు వెల్లడించారు. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్, గ్రేహౌండ్స్, జిల్లా పోలీసుల సమన్వయంతో చేపట్టిన చర్యల ఫలితంగా ఈ ఏడాది ఇప్పటివరకు మొత్తం 266 మంది అజ్ఞాత మావోయిస్టులు హింసామార్గాన్ని వీడి లొంగిపోయినట్లు తెలిపారు. వీరిలో ముగ్గురు కేంద్ర కమిటీ సభ్యులు, 12 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక ప్రాంతీయ కమిటీ సభ్యుడు, 25 మంది డివిజనల్ కమిటీ కార్యదర్శులు, సభ్యులు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. వీరితోపాటు 94 మంది ఏరియా కమిటీ సభ్యులు, 131 మంది సాధారణ మావోయిస్టులు లొంగిపోయారని వివరించారు. దీంతో మావోయిస్టు పార్టీ నెట్‌వర్క్ అగ్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు తీవ్రంగా బలహీనపడిందని పోలీసులు చెబుతున్నారు. తెలంగాణకు చెందిన ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి, జడె రత్నబాయి అలియాస్ సుజాత, వార్త శేఖర్ అలియాస్ మంగు ప్రస్తుతం ఇతర రాష్ట్రాల్లో పనిచేస్తూ అజ్ఞాతంలో ఉన్నారని పోలీసులు వెల్లడించారు. తెలంగాణకు చెందిన కీలక నేతల్లో ఈ ముగ్గురే అజ్ఞాతంలో మిగిలినట్లు పేర్కొన్నారు. సుశీల రాణి లొంగుబాటుతో మావోయిస్టు పార్టీ మరింత బలహీనపడిందని పోలీసులు అభిప్రాయపడ్డారు. ఇంకా అజ్ఞాతంలో ఉన్నవారు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న లొంగుబాటు, పునరావాస విధానాన్ని ఉపయోగించుకుని హింసామార్గాన్ని వీడి సాధారణ జనజీవన స్రవంతిలో కలవాలని పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.

# విమర్శలకు భయపడొద్దు

**సోషల్ మీడియాకు తలొగ్గొద్దు**

**సీజేఐ జస్టిస్ సూర్యకాంత్**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15 (ఉద్యమ కెరటం):** న్యాయవ్యవస్థపై సోషల్ మీడియానో లేదా ఇతర బాహ్య శక్తుల ప్రభావమో ఉండకూడదని, అలాగే విమర్శలకు న్యాయవ్యవస్థను అతీతంగా ఉంచడం కూడా సరికాదని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో జరిగిన 6వ రామ్ జెఠ్మలానీ స్మారక ఉపన్యాసంలో 'జస్టిస్ సీన్ టు బీ డన్: ట్రాన్స్‌పరెన్సీ అండ్ పబ్లిక్ ట్రస్ట్ యాజ్ పిల్లర్స్ ఆఫ్ ది లీగల్ సిస్టమ్' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. కోర్టుల పనితీరుపై వచ్చే నిర్మాణాత్మక విమర్శలు న్యాయవ్యవస్థలో జవాబుదారీతనాన్ని, పారదర్శకతను పెంచడానికి తోడ్పడతాయని, ప్రజల విశ్వాసాన్ని పొందాలంటే పరిశీలనకు సిద్ధంగా ఉండాలని సూచించారు. తీర్పు ప్రకటించడంతో పాటు దాని వెనుక ఉన్న కారణాలను కూడా ప్రజలు తెలుసుకునే అవకాశం ఉండాలని, అప్పుడే పూర్తి పారదర్శకత సాధ్యమవుతుందని సీజేఐ పేర్కొన్నారు. అయితే పారదర్శకత పేరుతో కోర్టు వ్యవహారాలను సోషల్ మీడియా అభిప్రాయాల ప్రభావానికి వదిలేయకూడదని హెచ్చరించారు. కేసులో ఓడిపోయిన వ్యక్తి కూడా తనకు వ్యతిరేకంగా వచ్చిన తీర్పును ఇచ్చిన ప్రక్రియ న్యాయంగా జరిగిందని నమ్మినప్పుడే న్యాయవ్యవస్థపై నిజమైన విశ్వాసం ఏర్పడుతుందన్నారు. 1924 నాటి ఇంగ్లండ్ కేసు 'ఆర్ వర్సెస్ ససెక్స్ జస్టీసెస్'ను ఉదాహరణగా చూపిస్తూ.. న్యాయం జరగడం మాత్రమే కాకుండా అది న్యాయంగా జరిగినట్లు కనిపించడమూ అంతే ముఖ్యమని తెలిపారు. సామాన్యుడికి న్యాయం సులువుగా చేరేలా ఈ-కోర్టుల ప్రాజెక్టు, ఎలక్ట్రానిక్ సమన్లు, ఈ-సేవా కేంద్రాల వాహనాల ద్వారా సేవలను విస్తరిస్తున్నామని ఈ సందర్భంగా వివరించారు.

# పసుపు నీళ్ల కేసులో హైకోర్టు కీలక ఆదేశాలు

**నిందితులను వెంటనే అరెస్ట్ చేయొద్దు**

**పోలీసులకు హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు**

**హైదరాబాద్, సెప్టెంబరు 15(ఉద్యమ కెరటం):** సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్ సమీపంలో చోటుచేసుకున్న 'పసుపు నీళ్ల' ఘటన కేసులో తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కేసులో నిందితులను తక్షణమే అరెస్ట్ చేయవద్దని పోలీసులను ఆదేశించింది. నిందితులకు చట్టపరమైన నోటీసులు జారీ చేసి, నిబంధనల ప్రకారం దర్యాప్తు కొనసాగించాలని స్పష్టం చేసింది. కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాల్లో కాంగ్రెస్ నేతలు నిర్వహించిన నిరసన అనంతరం బీఆర్ఎస్ కార్యకర్తలు అక్కడికి చేరుకుని పసుపు నీళ్లతో శుద్ధి చేయడం వివాదానికి దారితీసింది. దీనిపై కాంగ్రెస్ నేతలు, స్థానికులు ఫిర్యాదులు చేయడంతో పోలీసులు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేశారు. నిందితులను అరెస్ట్ చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో కొందరు హైకోర్టును ఆశ్రయించారు. అత్యవసరంగా విచారణ చేపట్టిన ధర్మాసనం పోలీసుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ఏడేళ్లలోపు శిక్ష పడే సెక్షన్ల కింద కేసులు నమోదైనప్పుడు నిందితులను ఎలా అరెస్ట్ చేస్తారని ప్రశ్నించింది. ఇలాంటి కేసుల్లో సుప్రీంకోర్టు నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలని సూచించింది. నిబంధనలకు విరుద్ధంగా అరెస్టులకు వెళ్లొద్దని స్పష్టం చేస్తూ.. నోటీసులు జారీ చేసి చట్ట ప్రకారం దర్యాప్తు కొనసాగించాలని పోలీసులను ఆదేశించింది.

# ఉస్మానియా'కు పూర్వ వైభవం తీసుకురావాలి

**ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారం కోరిన సీఎం రేవంత్**

**ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5తో మర్యాదపూర్వక భేటీ**

**సిటీ కాలేజ్ పునరుద్ధరణకూ సహకరించాలని విజ్ఞప్తి**

**మూసీని 'నైట్ ఎకానమీ' కేంద్రంగా తీర్చిదిద్దుతామని వెల్లడి**

**తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ప్రత్యేక ఆహ్వానం**



**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (ఉద్యమ కెరటం):** హైదరాబాద్ వారసత్వ సంపద పరిరక్షణలో ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారం మరింత అవసరమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలోని చారిత్రక సిటీ కాలేజ్, ఉస్మానియా ఆస్పత్రి భవనాల పునరుద్ధరణలో ఫౌండేషన్ భాగస్వామ్యం కావాలని కోరారు. తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్--5తో మంగళవారం సీఎం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఆగా ఖాన్ ఫౌండేషన్‌పై తమకు అత్యంత గౌరవం ఉందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని వారసత్వ సంపద పునరుద్ధరణలో ఆ సంస్థ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఫౌండేషన్ సహకారంతో ఇటీవల శాసనమండలి భవనాన్ని పునరుద్ధరించుకున్నామని, కుతుబ్ షాహీ సమాధుల పునరుద్ధరణలోనూ ఆ సంస్థ విశేషంగా పనిచేసిందని గుర్తుచేశారు.

**ఉస్మానియాను వారసత్వ సంపదగా..**

మూసీ నది పునరుజ్జీవానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తోందని సీఎం వివరించారు. మూసీ పరివాహక ప్రాంతంలోని సిటీ కాలేజ్, ప్రస్తుత ఉస్మానియా ఆస్పత్రి భవనాల పునరుద్ధరణకు ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకరించాలని కోరారు. ఉస్మానియా ఆస్పత్రి కోసం గోషామహల్‌లో కొత్త భవనాన్ని నిర్మిస్తున్నామని, ప్రస్తుతం ఉన్న చారిత్రక భవనాన్ని వారసత్వ సంపదగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ ఆలోచనగా వెల్లడించారు. మూసీ నదిని నైట్ ఎకానమీకి అనువుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

**గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానం**

డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు తప్పకుండా హాజరుకావాలని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్‌ను సీఎం ఆహ్వానించారు. వందకు పైగా దేశాల ప్రతినిధులు ఈ సమ్మిట్‌లో పాల్గొంటారని చెప్పారు. 2047 నాటికి దేశ స్థూల దేశీయోత్పత్తిలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని రేవంత్‌రెడ్డి వివరించారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని, దీనిని నెట్-జీరో సిటీగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. విమానాశ్రయానికి 20 నిమిషాల ప్రయాణ దూరంలో ఇది ఉంటుందని చెప్పారు. ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను సింగపూర్‌కు చెందిన సంస్థ రూపొందిస్తోందని సీఎం తెలిపారు. మొత్తం విస్తీర్ణంలో 15 వేల ఎకరాలను గ్రీన్ జోన్‌గా ఏర్పాటు చేస్తున్నామని, అమెజాన్ వంటి సంస్థలు ఇప్పటికే అక్కడ తమ కార్యకలాపాలను ప్రారంభించాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సలహాదారు రామకృష్ణారావుతోపాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాలకు 5 లక్షల ఇళ్లు

**ఏపీకి 3 లక్షలు.. తెలంగాణకు 2 లక్షలు**

**దేశవ్యాప్తంగా 2 కోట్ల ఇళ్ల కేటాయింపు**

**'ఆవాస్ ప్లస్' యాప్‌తో లబ్ధిదారుల గుర్తింపు**

**ఒక్కో ఇంటికి రూ.3 లక్షల వరకు సాయం**

**రెండేళ్లలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసే లక్ష్యం**




**హైదరాబాద్/అమరావతి, సెప్టెంబరు 15(ఉద్యమ కెరటం):** సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ఊరటనిచ్చింది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు కలిపి 5 లక్షల ఇళ్లు కేటాయించినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి, జలశక్తి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఇందులో ఏపీకి 3 లక్షలు, తెలంగాణకు 2 లక్షల ఇళ్లు మంజూరైనట్లు వెల్లడించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద దేశవ్యాప్తంగా 2 కోట్ల ఇళ్లను కేటాయిస్తున్నామని పెమ్మసాని తెలిపారు. 2024లో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గతంలో మంజూరైన ఇళ్లకు అదనంగా మరిన్ని ఇళు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఏపీకి అదనంగా 2.25 లక్షలు, తెలంగాణకు 1.25 లక్షల ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అర్హులైన కుటుంబాలను గుర్తించేందుకు 'ఆవాస్ ప్లస్' మొబైల్ యాప్‌ను వినియోగించనున్నట్లు పెమ్మసాని తెలిపారు. ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి అర్హత ఉన్న కుటుంబాలకు అన్యాయం జరగకుండా చూస్తామని చెప్పారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి కేంద్రం నుంచి ప్రాథమికంగా రూ.1.20 లక్షలు, అదనంగా రూ.1.80 లక్షల వరకు ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు. మరుగుదొడ్డి నిర్మాణానికి మరో రూ.12 వేల సాయం ఉంటుందని వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కేటాయించిన ఇళ్ల నిర్మాణం ఆశించిన స్థాయిలో జరగలేదని పెమ్మసాని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కేంద్రం 1.75 లక్షల ఇళ్లు కేటాయిస్తే 42 వేల ఇళ్లు మాత్రమే నిర్మించారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ ఏడాది మరిన్ని ఇళ్లు కేటాయించాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. కొత్తగా మంజూరైన ఇళ్లతో పాటు నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను రాబోయే 2-3 ఏళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

# రేపు హైదరాబాద్‌కు ఉప రాష్ట్రపతి

**తెలంగాణ విమోచన దినోత్సవానికి రాధాకృష్ణన్**

**పరేడ్ గ్రౌండ్‌లో జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథి**

**ఉదయం 8.30 గంటలకు హైదరాబాద్‌కు రాక**

**విస్తృత ఏర్పాట్లు చేపట్టాలన్న సీఎస్ సంజయ్ జాజు**

**ఉన్నతాధికారులతో సచివాలయంలో సమీక్ష**





**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (ఉద్యమ కెరటం):** ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఈ నెల 17న హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ విమోచన దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఉప రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ఉప రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై సంబంధిత శాఖల కార్యదర్శులు, పోలీసు ఉన్నతాధికారులతో సచివాలయంలో మంగళవారం సీఎస్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17న ఉదయం 8.30 గంటలకు ఉప రాష్ట్రపతి హైదరాబాద్‌కు చేరుకుంటారని తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే తెలంగాణ విమోచన దినోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు. కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో సంబంధిత శాఖలు సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని సంజయ్ జాజు ఆదేశించారు సమీక్ష సమావేశంలో జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అహ్మద్ నదీమ్, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, డీజీపీ సీవీ ఆనంద్, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చొంగ్తూ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ముకుందరెడ్డితోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పంతాలకు పోవద్దు.. పదోన్నతులు కోల్పోవద్దు

**డీఎస్పీలకు డీజీపీ సి.వి.ఆనంద్ సూచన**

**అదనపు ఎస్పీలుగా 37 మందికి పదోన్నతులు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (ఉద్యమ కెరటం):** పంతాలకు పోయి పదోన్నతులను కోల్పోవద్దని 1991, 1995, 1996 బ్యాచ్‌ల డీఎస్పీలకు డీజీపీ సి.వి.ఆనంద్ సూచించారు. పదోన్నతుల విషయంలో నెలకొన్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు తాను ప్రత్యేక చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. అవసరమైతే ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయా బ్యాచ్‌లకు చెందిన 37 మంది డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతులు రావాల్సి ఉంది. అయితే కొందరు అధికారులు కోర్టులను ఆశ్రయించడంతో పదోన్నతుల ప్రక్రియ పెండింగ్‌లో పడింది. ఈ నేపథ్యంలో డీజీపీ ఆనంద్ చొరవ తీసుకుని తన కార్యాలయంలో సంబంధిత బ్యాచ్‌ల అధికారులతో సమావేశమయ్యారు. కోర్టు కేసుల విషయంలో నిర్ణయం తీసుకునేందుకు వారికి వారం రోజుల సమయం ఇచ్చారు. 'కేసులు వేసుకుని నష్టపోవద్దు. మీ సమస్య పరిష్కారానికి నేను ముందుంటా. అందరూ సహకరిస్తే త్వరగా పదోన్నతులు కల్పించవచ్చు' అని డీజీపీ అధికారులకు సూచించారు. ప్రస్తుతం ఉన్న 37 అదనపు ఎస్పీ ఖాళీలకు వెంటనే పదోన్నతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీజీపీతో సమావేశం అనంతరం వరంగల్ జోన్‌కు చెందిన 1991, 1995, 1996 బ్యాచ్‌ల అధికారులు తాము కోర్టులో దాఖలు చేసిన కేసులను ఉపసంహరించుకుంటున్నట్లు డీజీపీకి లేఖ అందించారు. హైదరాబాద్ సిటీకి చెందిన ఆయా బ్యాచ్‌ల అధికారులు కూడా కేసుల ఉపసంహరణకు సుముఖత వ్యక్తం చేశారు. దీంతో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతుల అంశం కొలిక్కి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. డీజీపీ ఆనంద్ చొరవతో సమస్య పరిష్కారం దిశగా కదలిక రావడంపై సంబంధిత అధికారులు హర్షం వ్యక్తం చేశారు.



# ‘22ఏ’ అక్రమాలపై న్యాయ విచారణ జరపాలి

- ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టి వేధిస్తున్నారని కేటీఆర్ ఆరోపణ
- ‘30 శాతం కమీషన్ల కోసం చిల్లర ప్రయత్నాలు మానుకోవాలి’
- ‘ధరణి రక్షణ కవచం.. భూభారతి భూ హారతి’ అంటూ విమర్శ
- అసైన్డ్ భూములపై ఎస్సీ, ఎస్టీలకు యాజమాన్య హక్కులు కల్పించాలని డిమాండ్
- ‘రెండేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం.. అక్రమాలన్నీ బయటపెడతాం’



**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (ఉద్యమ కెరటం):** లక్షల ఎకరాల భూములను 22ఏ కింద నిషేధిత జాబితాలో చేర్చి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టి దోపిడీకి పాల్పడుతున్నారని, 30 శాతం కమీషన్ల కోసం చేస్తున్న చిల్లర ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. 22ఏ వ్యవహారంపై న్యాయ విచారణ జరిపిస్తే అసలు నిజాలు బయటకు వస్తాయని పేర్కొన్నారు. ఢిల్లీలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు బయలుదేరిన సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 22ఏ అంశంపై అసెంబ్లీలో ప్రభుత్వం సరైన సమాధానం ఇస్తుందని ఆశించామని, అయితే రెవెన్యూ మంత్రి కేవలం ‘సారీ’తో సరిపెట్టారని విమర్శించారు. తప్పు చేసింది అధికారులు కాదని, ప్రభుత్వమేనని ఆరోపించారు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా అధికారులపై నెపం నెట్టడం సరికాదన్నారు. ప్రజలు తమ కష్టార్జితంతో కొనుగోలు చేసిన కాలనీలు, అపార్ట్‌మెంట్లు, ఇళ్లను నిషేధిత జాబితాలో చేర్చినట్లయితే వాటిని బేషరతుగా తొలగించి బాధితులకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ధరణి వ్యవస్థ ప్రజల ఆస్తులకు రక్షణ కవచంలా ఉండేదని కేటీఆర్ పేర్కొన్నారు. యజమాని వేలిముద్ర లేకుండా ఆస్తి బదిలీ చేయడం సాధ్యం కాని విధంగా భద్రత ఉండేదన్నారు. ప్రస్తుతం యజమానులకు తెలియకుండానే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని, ఆస్తులు నిషేధిత జాబితాలోకి వెళ్తున్నాయని ఆరోపించారు. ‘ఇది భూభారతి కాదు.. భూ హారతి’ అని వ్యాఖ్యానించారు. అడ్డగోలు చర్యలను నిలిపివేసి ప్రజల యాజమాన్య హక్కులకు రక్షణ కల్పించేలా యథాతథ పరిస్థితిని పునరుద్ధరించాలని కోరారు. అసైన్డ్ భూముల విషయంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని కాంగ్రెస్ ఇచ్చిన హామీని అమలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన అసైన్డ్ భూములను క్రమబద్ధీకరించి వారికి యాజమాన్య హక్కులు కల్పించాలన్నారు. అసైన్డ్ భూములకు పట్టాలిచ్చే పేరుతో ముందుగానే ఒప్పందాలు జరుగుతున్నాయన్న అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. ప్రతి పథకం వెనుక అక్రమాలు ఉన్నాయన్న తమ ఆరోపణలు భవిష్యత్తులో నిజమని తేలుతాయని పేర్కొన్నారు. ‘రెండేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుంది.. తప్పు చేసిన వారిని వదిలిపెట్టం’ అని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రధాన ప్రతిపక్షంగా నిరసన తెలిపే హక్కు తమకు ఉందని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ సభ్యులు అనని మాటలను వారికి అంటగట్టి సభ నుంచి బయటకు పంపారని ఆరోపించారు. ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అంశాల నుంచి తప్పించుకునేందుకే తమ సభ్యులను సస్పెండ్ చేసిందన్నారు. సస్పెండ్ చేసినప్పటికీ తాము ప్రజల్లోనే ఉంటామని, ప్రజా సమస్యలను ఎత్తిచూపుతూనే ఉంటామని స్పష్టం చేశారు. 22ఏ అంశంతోపాటు ప్రజల భూములకు సంబంధించిన సమస్యలను ప్రజల మధ్యకు తీసుకెళ్తామని చెప్పారు. 22ఏ వ్యవహారంపై న్యాయ విచారణ జరిగితే అందరికీ మంచిదేనని కేటీఆర్ అన్నారు. ‘తప్పు చేసింది ప్రభుత్వం.. శిక్ష అనుభవిస్తున్నది ప్రజలు’ అని వ్యాఖ్యానించారు. నిషేధిత జాబితాలో ఆస్తులను చేర్చడం ద్వారా ప్రజల యాజమాన్య హక్కులను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. ఇవాళ తప్పించుకున్నా రేపు తప్పించుకోలేరని హెచ్చరించారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ ఇంటిపై దాడి ఘటనను ప్రస్తావిస్తూ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. తమ సిబ్బందిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి అక్కడే కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల కంటే హీనంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పోలీసులను నమ్ముకుంటే న్యాయం దొరకదనే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్నామని, కోర్టులో తప్పకుండా న్యాయం లభిస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. కామన్ సివిల్ కోడ్‌పై ఇప్పుడే నిర్ణయం చెప్పాల్సిన అవసరం లేదని కేటీఆర్ పేర్కొన్నారు. ఆ ప్రతిపాదన వచ్చినప్పుడు పార్టీ నాయకత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

# అక్కడ ఘనం.. ఇక్కడ భయం

- మజ్లిస్ భయంతోనే విమోచన దినం నిర్వహించడంలేదు
- బీఆర్ఎస్, కాంగ్రెస్‌లపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఫైర్
- బీజేపీ మహిళా మోర్చా ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రి



**హైదరాబాద్, సెప్టెంబర్ 15:** కర్ణాటక, మహారాష్ట్రల్లో తెలంగాణ విముక్తి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తుంటే తెలంగాణలో మాత్రం కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఎంఐఎం భయంతో నిర్వహించడం లేదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి మండిపడ్డారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించనున్న సందర్భాన్ని పురస్కరించుకుని బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం నుంచి అసెంబ్లీ ప్రాంగణంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వరకు మంగళవారం నిర్వహించిన మహిళా శక్తి స్కూటీ ర్యాలీని ఆయన ప్రారంభించి ర్యాలీలో బైక్ నడిపారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ నిజాం సైన్యం, రజాకార్లు గ్రామాలపై పడి ప్రజల, హిందువుల ఆస్తులను లూటీ చేస్తూ జాతీయ జెండా ఎగరేసినవారిని నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపుతూ మహిళలను చిత్రహింసలకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ దురాగతాలకు వ్యతిరేకంగా తెలంగాణ ఆడబిడ్డలు ధైర్యంగా పోరాడి తరిమికొట్టారని గుర్తుచేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జోక్యంతో సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రాంతానికి విముక్తి లభించి ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నారని తెలిపారు. నాటి హైదరాబాద్ సంస్థానంలో ఉన్న నేటి మరాఠ్వాడా, కర్ణాటక ప్రాంతాల్లో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా హైదరాబాద్ ముక్తి దినోత్సవాలను నిర్వహిస్తున్నాయని, కానీ నిజాం పాలన ప్రధాన కేంద్రమైన హైదరాబాద్‌లోనే తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకపోవడం దురదృష్టకరమని అన్నారు. అమరవీరుల ఆత్మబలిదానాలు, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా అధికారికంగా హైదరాబాద్ ముక్తి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు. ఆ రోజు ఉదయం 8 గంటలకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే ఈ చారిత్రక వేడుకలకు రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

### నాటి త్యాగాలను నేటి తరానికి తెలపాలి : రామచందర్ రావు

హైదరాబాద్ విముక్తి, భారత యూనియన్‌లో విలీనం వెనుక ఉన్న త్యాగాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని దశాబ్దాలుగా డిమాండ్ ఉన్నా ఎంఐఎం భయం, ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగానే గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు దీనిని నిరాకరిస్తున్నాయని మండిపడ్డారు. మహిళా శక్తి స్కూటీ ర్యాలీలో ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ పాలన నుంచి భారతదేశం స్వాతంత్ర్యం దిశగా అడుగులు వేస్తున్న సమయంలో హైదరాబాద్‌ను ప్రత్యేక రాజ్యంగా ఉంచి పాకిస్థాన్‌తో కలపాలని నిజాం కుట్ర పన్నారని విమర్శించారు. నిజాం, రజాకార్ల పాలనలో తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా మహిళలు క్రూర హింసను ఎదుర్కొన్నారని రామచందర్ రావు తెలిపారు. తెలంగాణ బిడ్డలు ఎంతో ధైర్యంతో పోరాడారని, ఎందరో జాతీయవాదులు ప్రాణత్యాగం చేశారని, నిజాంకు వ్యతిరేకంగా గళమెత్తిన షోయబుల్లా ఖాన్‌ను సైతం హత్య చేశారని తెలిపారు. ప్రజల అసాధారణ ధైర్యం, త్యాగాలు చరిత్రలో నిలిచిపోయేవి అయినా గత ప్రభుత్వాలు ఆ వారసత్వాన్ని గౌరవించడంలో, వారి పోరాట గాథను సమాజానికి తెలియజేయడంలో విఫలమయ్యాయన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిల కృషితోనే కేంద్రం విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నదని, తద్వారా ఈ ఉజ్వల చరిత్రకు సరైన గుర్తింపు దక్కిందని తెలిపారు. విమోచన సందేశాన్ని, చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మహిళా శక్తి స్కూటీ ర్యాలీని విజయవంతంగా నిర్వహించిన మహిళా మోర్చా బృందాన్ని, పాల్గొన్న ప్రతి ఒక్కరినీ రామచందర్ రావు అభినందించారు.

# ఉద్యోగులతో పెట్టుకున్నారు.. కాంగ్రెస్ ఓటమి ఖాయం

- ఉద్యోగులు, ఉపాధ్యాయులను నిర్లక్ష్యం చేస్తున్నారన్న కవిత
- 630 మండలాలకు ఎనిమిది మంది శాశ్వత ఎంఈవోలేనా అంటూ ప్రశ్న
- పీఆర్సీ, డీఏలపై స్పందన లేదని విమర్శ
- బోధనకు దూరం చేసే పనిభారం తగ్గించాలని డిమాండ్
- అధికారంలోకి వస్తే ఉద్యోగులకు సముచిత గౌరవమని హామీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (ఉద్యమ కెరటం):** ఉద్యోగులు, ఉపాధ్యాయులతో విభేదించిన ప్రభుత్వాలు మళ్లీ అధికారంలోకి వచ్చిన దాఖలాలు లేవని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని, వారిని చిన్నచూపు చూస్తూ నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయమని వ్యాఖ్యానించారు. బాగ్‌లింగంపల్లిలో మంగళవారం ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై నిర్వహించిన సదస్సులో కవిత మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగులను రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వాములుగా చూస్తామని చెప్పారు. ఉద్యోగులకు గౌరవం కల్పిస్తూ, వారు సంతోషంగా పనిచేసే వాతావరణం ఉండేలా విధానాలు రూపొందిస్తామని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉపాధ్యాయులు ఉద్యోగం కంటే ఉద్యమానికే ప్రాధాన్యం ఇచ్చి పోరాడారని కవిత గుర్తుచేశారు. రాష్ట్రంలోని 630 మండలాలకు కేవలం ఎనిమిది మంది శాశ్వత మండల విద్యాధికారులు మాత్రమే ఉండటం విద్యా వ్యవస్థపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. విద్యార్థులకు ఉచితంగా, నాణ్యమైన విద్య అందించాలంటే బలమైన విద్యా యంత్రాంగం అవసరమన్నారు. విద్యార్థుల వివరాలు, వివిధ రకాల నివేదికల పేరుతో ఉపాధ్యాయులపై అదనపు పనిభారం మోపుతూ వారిని బోధనకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. ఒక్క ఉపాధ్యాయుడితో నడుస్తున్న పాఠశాలల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సహకారం లేకుండా ఏ ప్రభుత్వ కార్యక్రమాన్నీ సమర్థంగా అమలు చేయడం సాధ్యం కాదని కవిత అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు కూడా ఆశించిన స్థాయిలో జరగడం లేదని విమర్శించారు. మైకుల ముందు ఎన్ని గొప్పలు చెప్పినా.. పింఛన్లు, యూరియా, రైతులకు విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎన్నికలకు ముందు పీఆర్సీ, డీఏలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు వాటిపై స్పందించడం లేదని కవిత విమర్శించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ వారితో విభేదాలు పెంచుకోవడం ప్రభుత్వానికే నష్టమని పేర్కొన్నారు.





# నిరుద్యోగ యువతకు అండగా పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్

### కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగార్థులకు ఉచిత కోచింగ్

**ఉద్యమ కెరటం, ఖమ్మం:** పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత కోసం పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ క్యాంపు నిర్వహిస్తున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సారథ్యంలో రైట్ ఛాయిస్ అకాడమీ నిర్వహణలో ఈ శిక్షణ కొనసాగుతోంది. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో పరీక్షా విధానానికి అనుగుణంగా బోధన అందిస్తున్నారు. ఎల్ఈడీ స్క్రీన్లపై డిజిటల్ తరగతులతో పాటు ప్రతిరోజూ గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తూ అభ్యర్థుల సామర్థ్యాన్ని అంచనా వేస్తున్నారు. లోపాలను గుర్తించి మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. నిరుద్యోగ యువతపై ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన కోచింగ్ అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోలీస్ ఉద్యోగాలను లక్ష్యంగా పెట్టుకున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# జాబ్ ఫెయిర్‌ను వినియోగించుకోవాలి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మహిళలు ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకక అధ్యక్షుడు ఖ్వాజా సిరాజుద్దీన్ కోరారు. సేవా ఫౌండేషన్, స్కిల్ రూట్స్, యూనిసెఫ్ సహకారంతో బుధవారం మహిళల కోసం ఉచిత మెగా జాబ్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని సాత్నాల రోడ్డులోని అర్పా గార్డెన్లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జాబ్ ఫెయిర్ జరుగుతుందని పేర్కొన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగి బీఈ, బీటెక్, బీసీఏ, ఎంసీఏ విద్యార్హతలు ఉన్న మహిళలు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు విద్యార్హత, సామర్థ్యం, నైపుణ్యాల ఆధారంగా నెలకు రూ.15వేల నుంచి రూ.17వేల వరకు వేతనం లభిస్తుందని పేర్కొన్నారు. వివిధ కంపెనీల అధికారులు, ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, ఎస్పీ హాజరుకానున్నట్లు వివరించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్ లను వేర్వేరుగా కలిసి జాబ్ ఫెయిర్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సేవా ఫౌండేషన్ సభ్యులు షేక్ జావేద్, షేక్ ఇస్మాయిల్, అస్లమ్ ఖాన్, తబ్రేజ్ ఖాన్, సమీర్ ఖాన్, రిజ్వాన్ ఖాన్, ఇమ్రాన్ ఖాన్, మోయిాద్ ఖాన్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ఫొటో ఎగ్జిబిషన్

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (ఉద్యమ కెరటం):** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 16, బుధవారం ఉదయం 11 గంటలకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించనున్నారు. ఈ ప్రదర్శనను మాజీ గవర్నర్లు సి. విద్యాసాగర్ రావు, బండారు దత్తాత్రేయ, పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ ప్రారంభించనున్నారు. కార్యక్రమాన్ని కవర్ చేయాల్సిందిగా మీడియా ప్రతినిధులను ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, హైదరాబాద్ ఆహ్వానించింది. కావాలంటే దీన్ని ఇంకా క్లుప్తంగా 4-5 లైన్ల వార్తగా కూడా ఇస్తాను.

# ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సెకండ్ ఫేజ్ సీట్ల కేటాయింపు



**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (ఉద్యమ కెరటం):** 2026--27 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సెకండ్ ఫేజ్ సీట్ల కేటాయింపును కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేసింది. సీట్లు పొందిన విద్యార్థులు సెప్టెంబర్ 19 సాయంత్రం 4 గంటలలోపు కేటాయించిన కళాశాలల్లో ఒరిజినల్ సర్టిఫికెట్లు, బాండ్లు తదితర పత్రాలతో చేరాలని సూచించింది. అలాగే ఎంబీబీఎస్/బీడీఎస్ మేనేజ్‌మెంట్ కోటా ఫస్ట్ ఫేజ్ సీట్ల కేటాయింపును కూడా విడుదల చేసింది. ఈ కోటాలో సీట్లు పొందిన విద్యార్థులు సెప్టెంబర్ 19 సాయంత్రం 6 గంటలలోపు సంబంధిత కళాశాలల్లో అడ్మిషన్ పూర్తి చేసుకోవాలని యూనివర్సిటీ తెలిపింది. ఎంబీబీఎస్, బీడీఎస్ అకడమిక్ సెషన్ సెప్టెంబర్ 15 నుంచి ప్రారంభమైనట్లు పేర్కొంది.

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
బుధవారం 16 సెప్టెంబర్ 2026




# ఉద్యోగం పోయింది

## ఉదయం 6 గంటలకే మెయిల్!

### ఒరాకిల్‌లో మరో విడత భారీ లేఆఫ్స్
### సమాచారం అందిన రోజే చివరి పనిదినం
### కృత్రిమ మేధపై భారీగా పెట్టుబడులు
### ఇప్పటికే 21 వేల మంది ఉద్యోగులకు కోత
### ఓవైపు ఏఐ విస్తరణ.. మరోవైపు ఖర్చుల కత్తెర

**న్యూయార్క్, సెప్టెంబర్ 15 (ఉద్యమ కెరటం):** టెక్ ఉద్యోగులను 'లేఆఫ్స్' భయం వెంటాడుతూనే ఉంది. ఎప్పుడు ఉద్యోగం పోయిందంటూ ఈమెయిల్ వస్తుందో తెలియని పరిస్థితుల్లో తాజాగా అమెరికా టెక్ దిగ్గజం ఒరాకిల్‌లో మరో విడత ఉద్యోగాల కోతలు మొదలైనట్లు సమాచారం. ప్రభావిత ఉద్యోగులకు ఉదయం 6 గంటలకే ఈమెయిల్ పంపి ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు తెలియజేసినట్లు బిజినెస్ ఇన్‌సైడర్ నివేదించింది. సంస్థలో జరుగుతున్న విస్తృత పునర్వ్యవస్థీకరణలో భాగంగానే తాజా కోతలు చేపట్టినట్లు తెలుస్తోంది. సోమవారం నుంచి తాజా లేఆఫ్స్ మొదలైనట్లు సమాచారం. ఉద్యోగాలు కోల్పోయిన కొందరు లింక్డ్‌ఇన్, రెడిట్, బ్లైండ్ వంటి వేదికల్లో తమ అనుభవాలను వెల్లడించారు. ముగ్గురు ప్రభావిత ఉద్యోగులతో మాట్లాడడంతోపాటు సంస్థ పంపిన అంతర్గత నోటిఫికేషన్‌ను పరిశీలించినట్లు బిజినెస్ ఇన్‌సైడర్ పేర్కొంది. సంస్థాగత మార్పుల్లో భాగంగా ఆయా ఉద్యోగుల పాత్రలను తొలగిస్తున్నట్లు ఉదయం అందిన ఈమెయిల్‌లో పేర్కొన్నట్లు సమాచారం. అంతేకాదు.. నోటిఫికేషన్ అందుకున్న రోజే చివరి పనిదినంగా నిర్ణయించినట్లు నివేదికలు చెబుతున్నాయి. తాజా విడతలో మొత్తం ఎంతమంది ఉద్యోగాలు కోల్పోయారన్న విషయాన్ని మాత్రం ఒరాకిల్ అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. ఒకవైపు ఉద్యోగులను తగ్గిస్తున్న ఒరాకిల్.. మరోవైపు కృత్రిమ మేధ, క్లౌడ్ మౌలిక సదుపాయాల విస్తరణకు భారీగా పెట్టుబడులు పెడుతోంది. 2027 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో సంస్థ మూలధన వ్యయం 28.5 బిలియన్ డాలర్లకు చేరినట్లు పేర్కొంది. గతేడాది ఇదే సమయంలో 8.5 బిలియన్ డాలర్లుగా ఉన్న ఈ వ్యయం ఏడాదిలో మూడు రెట్లకుపైగా పెరిగింది. పూర్తి ఆర్థిక సంవత్సరంలో 90 నుంచి 95 బిలియన్ డాలర్ల వరకు మూలధన వ్యయం చేయాలన్న అంచనాను కొనసాగిస్తోంది. ఒరాకిల్ ఏఐ వ్యాపారానికీ భారీ డిమాండ్ కనిపిస్తోంది. ఒక్క త్రైమాసికంలోనే 30 బిలియన్ డాలర్లకుపైగా అదనపు ఏఐ క్లౌడ్ ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. దీంతో మిగిలిన పనితీరు బాధ్యతల విలువ 664 బిలియన్ డాలర్లకు చేరింది. అయితే ఏఐ విస్తరణకు చేస్తున్న భారీ పెట్టుబడులు నగదు ప్రవాహంపై ప్రభావం చూపుతున్నాయి. త్రైమాసికంలో సంస్థ స్వేచ్ఛా నగదు ప్రవాహం 5.4 బిలియన్ డాలర్ల మేర ప్రతికూలంగా నమోదైంది. డేటా సెంటర్లపై వ్యయం భారీగా పెరుగుతున్న సమయంలో ఖర్చులను అదుపు చేసేందుకు ఉద్యోగాల కోతలూ కొనసాగుతున్నాయన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

#### ఇప్పటికే 21 వేల ఉద్యోగాలకు కత్తెర

ఒరాకిల్‌లో ఈ ఏడాది ఉద్యోగాల కోతలు ఇదే తొలిసారి కాదు. 2026 ఆర్థిక సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా సుమారు 21 వేల మంది ఉద్యోగులను తగ్గించినట్లు సమాచారం. ఇది మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 13 శాతానికి సమానం. మే 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరం చివరికి సంస్థలో సుమారు 1.41 లక్షల మంది ఉద్యోగులు ఉండగా, అంతకుముందు ఏడాది ఈ సంఖ్య దాదాపు 1.62 లక్షలుగా ఉంది. ఉద్యోగుల తొలగింపులు, ఇతర పునర్వ్యవస్థీకరణ చర్యలకు సంబంధించి 2026 ఆర్థిక సంవత్సరంలో ఒరాకిల్ సుమారు 1.84 బిలియన్ డాలర్లను సెవరెన్స్, ఇతర ఎగ్జిట్ ఖర్చులుగా వెచ్చించినట్లు సమాచారం. అంతకుముందు ఏడాది ఈ వ్యయం 374 మిలియన్ డాలర్లుగా ఉంది. తన కార్యకలాపాల్లో కృత్రిమ మేధను స్వీకరించడం, విస్తృతంగా అమలు చేయడం ఉద్యోగుల సంఖ్య తగ్గడానికి దోహదపడుతున్న అంశాల్లో ఒకటని ఒరాకిల్ గతంలో పేర్కొంది. ఇదే సమయంలో పునర్వ్యవస్థీకరణ వ్యయాలు కూడా భారీగా పెరుగుతున్నాయి. తాజాగా అంచనా పునర్వ్యవస్థీకరణ ఖర్చులకు మరో 700 మిలియన్ డాలర్లు జోడించడంతో మొత్తం ప్రణాళిక వ్యయం దాదాపు 2.8 బిలియన్ డాలర్లకు చేరినట్లు సమాచారం. ఇందులో ఉద్యోగుల సెవరెన్స్, ఒప్పందాల రద్దు రుసుములు, ఇతర ఎగ్జిట్ ఖర్చులు ఉన్నాయి. ఆగస్టు 31 నాటికి ఈ ప్రణాళిక కింద దాదాపు 2.1 బిలియన్ డాలర్ల ఛార్జీలను నమోదు చేసినట్లు సంస్థ తెలిపింది. భవిష్యత్తులో మరిన్ని చర్యలు చేపట్టే అవకాశం ఉండటంతో అదనంగా 700 మిలియన్ డాలర్ల వ్యయాన్ని అంచనా వేసినట్లు పేర్కొంది.

#### ముందే వినిపించిన 'సెప్టెంబర్ కోతలు'

సెప్టెంబర్‌లో ఒరాకిల్ మరో విడత ఉద్యోగాల కోతలకు సిద్ధమవుతోందన్న వార్తలు గత నెలలోనే వెలువడ్డాయి. ఏఐ మౌలిక సదుపాయాల విస్తరణ కోసం భారీగా నిధులు సమీకరిస్తున్న నేపథ్యంలో పేరోల్ ఖర్చులను తగ్గించేందుకు ఉద్యోగుల సంఖ్యను తగ్గించవచ్చన్న అంచనాలు వచ్చాయి. తాజా పరిణామాలతో ఆ కసరత్తు అమల్లోకి వచ్చినట్లు నివేదికలు సూచిస్తున్నాయి. ఒరాకిల్ వ్యూహంలో ఇప్పుడు రెండు భిన్న చిత్రాలు కనిపిస్తున్నాయి. ఒకవైపు భవిష్యత్ ఏఐ, క్లౌడ్ డిమాండ్‌ను అందిపుచ్చుకునేందుకు డేటా సెంటర్లపై భారీగా పెట్టుబడులు పెడుతుండగా.. మరోవైపు ఖర్చులను అదుపులో పెట్టేందుకు ఉద్యోగాలపై కత్తెర వేస్తోంది. టెక్ రంగంలో ఏఐ విస్తరణ వేగం పెరుగుతున్న కొద్దీ ఉద్యోగుల్లో 'తర్వాత మెయిల్ ఎవరికో?' అన్న ఆందోళన మరింత పెరుగుతోంది.




# రూ.2 వేల దాటితే యూపీఐకి 'చార్జీలు'!

- చిన్న చెల్లింపులకు రుసుములేవని కేంద్రం స్పష్టీకరణ
- పెద్ద వ్యాపారి లావాదేవీలపై ఎండీఆర్‌కు అవకాశం
- రేటు ఖరారుపై 22 మంది సభ్యుల కమిటీ కసరత్తు
- 'ప్రజలపైనే పరోక్ష భారం' అంటూ రాహుల్ ఫైర్
- 'చార్జీలు వస్తే మళ్లీ నగదు వైపే' అంటున్న అష్నీర్ గ్రోవర్




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15 (ఉద్యమ కెరటం):** దేశవ్యాప్తంగా కోట్లాది మంది నిత్యం వినియోగిస్తున్న యూపీఐ చెల్లింపులపై 'చార్జీల' చర్చ మొదలైంది. రూ.2 వేల వరకు యూపీఐ, రూపే డెబిట్ కార్డు చెల్లింపులపై బ్యాంకులు, చెల్లింపు వ్యవస్థల సంస్థలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎలాంటి రుసుము వసూలు చేయకూడదని కేంద్రం సెప్టెంబర్ 14న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే రూ.2 వేలకుపైగా జరిగే వ్యాపారి చెల్లింపులపై భవిష్యత్తులో మర్చంట్ డిస్కౌంట్ రేటు విధించే అవకాశం ఉందన్న ప్రచారం రాజకీయంగా దుమారం రేపుతోంది. 2007 నాటి పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్టంలోని సెక్షన్ 10ఏ కింద ఈ నోటిఫికేషన్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఇటీవల పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఈ చట్టానికి సంబంధించిన సవరణ బిల్లు ఆమోదం పొందింది. ఆగస్టు 13న సమావేశాలు ముగిసిన అనంతరం యూపీఐపై ఎండీఆర్ రేట్లకు సంబంధించిన అంశాలను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలోని యూపీఐ అండ్ సర్వీసెస్ స్టీరింగ్ కమిటీ పరిశీలిస్తుందని కేంద్రం తెలిపినట్లు సమాచారం. ప్రస్తుతం లావాదేవీ మొత్తం ఎంత ఉన్నా సాధారణ యూపీఐ చెల్లింపులపై ఎండీఆర్ లేదు. రూ.2 వేల వరకు యూపీఐ, రూపే డెబిట్ కార్డు చెల్లింపులకు ఎలాంటి రుసుము ఉండదని స్పష్టత వచ్చినప్పటికీ.. ఆ పరిమితి దాటిన వ్యాపారి లావాదేవీలపై ఎండీఆర్ ఎంత ఉండాలన్నది ఇంకా ఖరారు కాలేదని సంబంధిత వర్గాల సమాచారం. బ్యాంకులు, సేవల సంస్థల ప్రతినిధులతో కూడిన 22 మంది సభ్యుల స్టీరింగ్ కమిటీ స్వయం సుస్థిరత, మార్కెట్ విస్తరణ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. పెద్ద వ్యాపారి చెల్లింపులపై 0.3 నుంచి 0.5 శాతం వరకు ఎండీఆర్ ఉండొచ్చన్న ప్రచారం సాగుతున్నప్పటికీ అధికారిక రేటు ఇంకా ఖరారు కాలేదు. వారంలో నిర్ణయం వెలువడి అక్టోబర్ నుంచి అమల్లోకి రావచ్చన్న వార్తలు కూడా వినిపిస్తున్నాయి. వ్యక్తి నుంచి వ్యక్తికి పంపుకునే నగదు బదిలీలపై మాత్రం ఈ రుసుము వర్తించదని, చర్చ ప్రధానంగా వ్యాపారులకు చేసే చెల్లింపులపైనేనని సమాచారం. బ్రెజిల్‌లోని పీఐఎక్స్ చెల్లింపు వ్యవస్థలో 0.33 శాతం, చైనాలోని చెల్లింపు వ్యవస్థల్లో సుమారు 0.40 శాతం మర్చంట్ రేటు ఉన్నట్లు పేర్కొంటున్నారు. భారత్‌లో ఎంత రేటు నిర్ణయిస్తారన్నది తేలాల్సి ఉంది.

#### 'నిశ్శబ్దంగా మార్గం సుగమం చేశారు'



ఈ పరిణామాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్రంపై తీవ్ర విమర్శలు చేశారు. యూపీఐపై ఫీజులు విధించేందుకు మోదీ ప్రభుత్వం నిశ్శబ్దంగా మార్గం సుగమం చేసిందని ఆరోపించారు. రూ.2 వేలకుపైగా జరిగే వ్యాపారి లావాదేవీలు సంఖ్యాపరంగా స్వల్పమే అయినప్పటికీ మొత్తం యూపీఐ లావాదేవీల విలువలో దాదాపు 65 శాతం వాటా కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. వినియోగదారుల నుంచి నేరుగా చార్జి వసూలు చేయబోమని ప్రభుత్వం చెప్పినా వ్యాపారులపై పడే ఎండీఆర్ భారాన్ని వారు వస్తువులు, సేవల ధరల్లో కలిపే అవకాశం ఉందని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. అంతిమంగా ఆ భారాన్ని సామాన్య వినియోగదారులే భరించాల్సి వస్తుందని విమర్శించారు.

#### 'మళ్లీ క్యాష్ వైపు మళ్లే ప్రమాదం'



యూపీఐపై చార్జీల ఆలోచనను భారత్‌పే సహ వ్యవస్థాపకుడు అష్నీర్ గ్రోవర్ కూడా వ్యతిరేకించారు. విజయవంతంగా పనిచేస్తున్న వ్యవస్థపై రుసుము విధించడం పరోక్ష పన్నులాంటిదేనని వ్యాఖ్యానించారు. రూ.2 వేల పరిమితిని ఎందుకు నిర్ణయించారన్నదే తన ప్రశ్న అని పేర్కొన్నారు. రూ.2 వేలకుపైగా జరిగే లావాదేవీలు సంఖ్యాపరంగా దాదాపు 4 శాతమే అయినప్పటికీ మొత్తం లావాదేవీల విలువలో వాటి వాటా సుమారు 66 శాతమని గ్రోవర్ పేర్కొన్నారు. పెద్ద మొత్తాలపై ఎండీఆర్ విధిస్తే వ్యాపారులు ఆ భారాన్ని వినియోగదారులపై మోపే అవకాశం ఉందన్నారు. లేదంటే రూ.12 వేల చెల్లింపును రూ.2 వేల చొప్పున పలుమార్లు చేసే పరిస్థితులు ఏర్పడవచ్చని అభిప్రాయపడ్డారు. దుకాణదారులు రూ.2 వేలకుపైగా యూపీఐ చెల్లింపులు తీసుకునేందుకు వెనుకాడి నగదు కోరే పరిస్థితి కూడా రావచ్చని హెచ్చరించారు. అలా జరిగితే నగదు వినియోగం పెరగడంతోపాటు మరిన్ని ఏటీఎంలు, నగదు నిర్వహణ కేంద్రాల అవసరం ఏర్పడుతుందని పేర్కొన్నారు. యూపీఐ వ్యవస్థకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల వల్ల అసలు ఎవరికి నష్టం జరుగుతోందో చెప్పాలని గ్రోవర్ ప్రశ్నించారు. రిజర్వ్ బ్యాంకు నుంచి ప్రభుత్వానికి రూ.2.87 లక్షల కోట్ల మిగులు బదిలీ జరిగిందని, లిస్టెడ్ బ్యాంకుల మొత్తం లాభాలు రూ.4.11 లక్షల కోట్లుగా ఉన్నాయని పేర్కొన్నారు. ఎన్‌పీసీఐ పన్నుకు ముందు మిగులు రూ.1,888 కోట్లుగా ఉందని గుర్తుచేశారు. అయితే రూ.2 వేలకుపైగా యూపీఐ చెల్లింపులకు చార్జీలు ఖరారయ్యాయని ఇప్పుడే భావించడానికి వీల్లేదు. ప్రస్తుతం చర్చలో ఉన్నది ప్రధానంగా వ్యాపారి చెల్లింపులపై ఎండీఆర్ విధించే అవకాశమే. రేటు, అమలు తేదీపై అధికారిక నిర్ణయం వెలువడిన తర్వాతే పూర్తి స్పష్టత రానుంది.

## దేశం నుంచి ఆశించడమే కాదు..

# సేవ చేయండి

### జెన్ జెడ్, జెన్ ఆల్ఫాకు నిర్మల పిలుపు

- దేశ హితానికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సూచన
- అనిశ్చితిలోనూ 7.8 శాతం వృద్ధి సాధించామని వెల్లడి
- తమిళనాడులో ఉపాధి అవకాశాలు పుష్కలమని వ్యాఖ్య



**చెన్నై, సెప్టెంబర్ 15 (ఉద్యమ కెరటం):** దేశం నుంచి మనం ఏం ఆశిస్తున్నామన్న దానికంటే.. దేశం కోసం మనం ఏం చేయగలమన్నదే యువత ఆలోచించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పిలుపునిచ్చారు. ముఖ్యంగా జెన్ జెడ్, జెన్ ఆల్ఫా తరాలు నాయకత్వ బాధ్యతలు చేపట్టి దేశ హితానికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. యువత ఆకాంక్షలను వినేందుకు దేశం సిద్ధంగా ఉందని, అదే సమయంలో పౌరులుగా తమ బాధ్యతలను కూడా చిత్తశుద్ధితో నిర్వర్తించాలని హితవు పలికారు. చెన్నైలోని డాక్టర్ ఎంజీఆర్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 36వ స్నాతకోత్సవంలో మంగళవారం నిర్మల సీతారామన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. "యువత నాయకత్వ బాధ్యతలు చేపట్టాలి. దేశ హితానికే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి. దేశం సురక్షితంగా, పటిష్ఠంగా ఉన్నప్పుడే మనకు ప్రశాంతమైన ఆవాసం ఉంటుంది. మన మాతృభూమిని ఎన్నటికీ వదులుకోకూడదు" అని పేర్కొన్నారు. రష్యా--ఉక్రెయిన్ యుద్ధం, మధ్యప్రాచ్యంలో నెలకొన్న అశాంతి వంటి అంతర్జాతీయ పరిణామాలను ప్రస్తావించిన ఆమె.. ప్రస్తుత పరిస్థితుల్లో దేశ భద్రత, స్థిరత్వానికి అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు.

#### అనిశ్చితిలోనూ 7.8 శాతం వృద్ధి

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి కొనసాగుతున్నప్పటికీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకుంటూ 7.8 శాతం వృద్ధి రేటును సాధించిందని నిర్మల సీతారామన్ పేర్కొన్నారు. తమిళనాడు పారిశ్రామిక, సాంకేతిక రంగాలకు కీలక కేంద్రంగా ఎదిగిందన్నారు. ముఖ్యంగా శ్రీపెరంబుదూర్--ఒరగడమ్ కారిడార్ ఆటోమొబైల్, స్మార్ట్‌ఫోన్ ఎగుమతులకు అంతర్జాతీయ కేంద్రంగా నిలుస్తోందని చెప్పారు. కోయంబత్తూరు, మధురై నగరాల్లో ఏర్పాటైన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయని వివరించారు. విద్యతోపాటు వినయం ముఖ్యమని, అహంకారాన్ని వీడి జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని హితవు పలికారు. దేశ అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషిస్తూ బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని యువతకు నిర్మల సీతారామన్ పిలుపునిచ్చారు.






# ఇదొక కపట నాటకం, బూటకపు ప్రకటన

- 'గిమ్మిక్కులతో ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించొద్దు'
- 'మసూద్‌పై రివార్డు పెంపుపై భారత్ తీవ్ర స్పందన
- మాటలు కాదు.. చేతల్లో చూపాలన్న విదేశాంగ శాఖ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15 (ఉద్యమ కెరటం):** జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ అధినేత, మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది మసూద్ అజర్‌పై రివార్డును పెంచుతూ పాకిస్థాన్ తీసుకున్న నిర్ణయంపై భారతదేశం అత్యంత తీవ్రస్థాయిలో స్పందించింది. పాకిస్థాన్ ప్రకటనను 'కపట నాటకం' అని, ప్రపంచ దేశాల కళ్లలో దుమ్ముగొట్టేందుకు ఆడుతున్న బూటకపు గిమ్మిక్కు అని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఖండించింది. ఉగ్రవాదానికి స్వర్గధామంగా మారిన ఒక దేశం నుంచి ఇలాంటి ప్రయోజనం లేని ప్రకటనలు రావడం కొత్తేమీ కాదని, కేవలం మాటలతో సరిపెట్టకుండా క్షేత్రస్థాయిలో కఠిన చర్యలు తీసుకున్నప్పుడే దానికి ప్రాధాన్యత ఉంటుందని మంగళవారం మీడియా సమావేశంలో విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. పాకిస్థాన్ ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎఫ్ఐఏ) తమ మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల 'రెడ్ బుక్ 2026' జాబితాలో మసూద్ అజర్ పేరును కొనసాగిస్తూ, అతనిపై ఉన్న రివార్డును మరో 20 లక్షల పాకిస్తానీ రూపాయలు పెంచి మొత్తం పీకేఆర్ 70 లక్షలకు (భారత కరెన్సీలో సుమారు రూ. 24 లక్షలు) చేర్చింది. వచ్చే అక్టోబర్‌లో ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) ప్లీనరీ సమావేశం జరగనున్న నేపథ్యంలో, మళ్లీ 'గ్రే లిస్ట్' ప్రమాదం నుంచి తప్పించుకోవడానికి పాకిస్థాన్ ఈ తరహా నాటకానికి తెరతీసిందని అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు విశ్లేషిస్తున్నారు. మసూద్ అజర్ తమ దేశంలో లేడని, ఆఫ్ఘనిస్థాన్‌లో ఉన్నాడని పాక్ సాకులు చెబుతున్నప్పటికీ, ఆ ఉగ్రవాది పాక్ రక్షణలోనే సురక్షితంగా ఉన్నాడని భారత్ గట్టిగా వాదిస్తోంది.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



# బీసీలకు అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రూప్నార్ రమేష్
- కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనానికి యత్నం
- బీసీ నాయకులను అడ్డుకున్న పోలీసులు



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** బీసీ కులగణన విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో బీజేపీ దిష్టిబొమ్మ దహనానికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రూప్నార్ రమేష్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా చేపట్టే జనగణనలో బీసీ కులగణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం 2025 మే 1న ప్రకటించినప్పటికీ, ప్రస్తుతం శాస్త్రీయ పద్ధతిలో కులగణన చేపట్టకుండా బీసీలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ఓబీసీ కుటుంబాలను సమగ్రంగా లెక్కించి, ప్రత్యేక బీసీ కాలమ్ ఏర్పాటు చేసి, ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీ కాలమ్ కోసం రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టిన సమయంలో బీజేపీ మద్దతు ఇవ్వకుండా అసెంబ్లీని బహిష్కరించడం బీసీల పట్ల ఆ పార్టీ వైఖరికి నిదర్శనమన్నారు.పోలీసులు అడ్డుకున్నా బీసీల హక్కుల కోసం తమ పోరాటం ఆగదని, కేంద్ర ప్రభుత్వం స్పందించి బీసీ కులగణనను శాస్త్రీయంగా నిర్వహించే వరకు ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని రూప్నార్ రమేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆవిడపు ప్రణయ్ , బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు లోబడే లాహు కుమార్, బీసీ సంక్షేమ సంఘం ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు సాయి కృష్ణ నాయకులు, అసద్, జయరాజ్, వెంకన్న, ముబీన్ తదితరులు పాల్గొన్నారు.

# టీఏజీఎస్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**గొడిసెల కార్తీక్**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో జరగబోయే తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీ ఏ జీ ఎస్) 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆహ్వాన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గొడిసెల కార్తీక్ కోరారు. మండలంలోని రాజుల గూడ గ్రామంలో టీఏజీఎస్ 4వ రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆయన స్థానిక నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా గొడిసెల కార్తీక్ మాట్లాడుతూ 'జల్, జంగిల్, జమీన్' నినాదంతో ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన యోధుడు కుమురం భీమ్ పేరు మీదుగా ఏర్పడిన జిల్లాలో, ఆదివాసీల సంక్షేమం కోసం నిరంతరం పోరాడే టీ ఏ జీ ఎస్ రాష్ట్ర మహాసభలు అక్టోబర్ 1, 2, 3, 4 తేదీలలో వైభవంగా జరగనున్నాయని తెలిపారు. జిల్లాలోని ఆదివాసీలు, గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల కార్యదర్శి దుర్గం నిఖిల్, ఆదివాసీ యువకులు సూర్య, సురేష్, శేఖర్, నాగు, చిత్రు, అంకుష్, మనోహర్, నిల్వంత రావు తదితరులు పాల్గొన్నారు.

# పూజల పేరుతో భయపెట్టి డబ్బులు వసూలు

**నకిలీ బాబా దంపతుల అరెస్టు**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** పూజల పేరుతో భయపెట్టి డబ్బులు వసూలు చేసిన నకిలీ బాబా దంపతులను అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఘటన వివరాలను వెల్లడించారు. మావల పోలీస్ స్టేషన్ పరిధిలో బాధితుడికి కుటుంబ సమస్యలు ఉన్నాయని గుర్తించిన నిందితుడు సలీం సయ్యద్ పూజల ద్వారా పరిష్కరిస్తానని నమ్మించాడు. ఇంటి వద్ద పూజలు నిర్వహించి బంగారం, వెండి కొనుగోలు చేయించాడు. అనంతరం మరిన్ని పూజా సామగ్రి కోసం యవత్మాల్ తీసుకెళ్లి భస్మం తదితర పూజా సామగ్రి పేరుతో రూ.81,600 వసూలు చేశాడు. అనంతరం బ్లాక్ మ్యాజిక్ ఉందని, పూజలు చేయకపోతే కుటుంబంలో ఒకరు చనిపోతారని భయపెట్టి మరో రూ.1.32 లక్షలు డిమాండ్ చేశాడు. నిందితుల మాటలపై అనుమానం వచ్చిన బాధితుడు మావల పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు భార్యాభర్తలను అరెస్టు చేశారు. మహారాష్ట్ర సంగ్లీ జిల్లా తాలూకా వద్వా, పెద్బాగ్ గ్రామానికి చెందిన సలీం సయ్యద్ అలియాస్ సలీం బషీర్ సయ్యద్, సలీం భార్య, సయ్యద్ షమాను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మూఢనమ్మకాలను ఆసరాగా చేసుకుని ప్రజలను భయపెట్టి డబ్బులు వసూలు చేసే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని డీఎస్పీ సూచించారు. ఈ సమావేశంలో మావల సీఐ బిడి.ప్రేమ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- నార్నూర్ మండలం జామ్డ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు, గ్రామపంచాయతీ భవనం ప్రారంభం



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. నార్నూర్ మండలం జామ్డ గ్రామంలో మంగళవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనంతో పాటు ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. అనంతరం మరో లబ్ధిదారుడి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ నిర్వహించి, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు భూమి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామస్థాయిలో ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సులభంగా, పారదర్శకంగా అందించేందుకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నామని పేర్కొన్నారు. తాగునీరు, రహదారులు, విద్యుత్ తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని సొంతింటి కలను సాకారం చేసుకోవాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మౌలిక వసతులను మెరుగుపర్చడంతో పాటు ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం దోహదపడుతుందని తెలిపారు. నూతన గ్రామపంచాయతీ భవనం అందుబాటులోకి రావడంతో ప్రజలకు స్థానిక పాలన, ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శంకర్, హౌసింగ్ డీఈ శాకీర్, ఏఈ రాకేష్, తహశీల్దార్ రాజలింగు, ఎంపీడీఓ కె.పుల్లారావు, సర్పంచ్ చంద్రావ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రక్షణ సేన బలోపేతానికి కృషి

- మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు
- జిల్లా అధ్యక్షుడిగా నియామకంపై కార్యకర్తల సంబరాలు




**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** తెలంగాణ రక్షణ సేన ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు నియమితులైన సందర్భంగా పార్టీ కార్యకర్తలు మంగళవారం సంబరాలు నిర్వహించారు. ఆదిలాబాద్ కేంద్రంలోని టైలర్స్ కాలనీలో గల ఆయన క్యాంపు కార్యాలయం వద్ద టపాసులు పేల్చి, మిఠాయిలు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలు "నెక్స్ట్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు" అంటూ నినాదాలు చేశారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాథోడ్ బాపురావు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవితకు, పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతానని పేర్కొన్నారు. ప్రజల హక్కులు, స్థానిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. జిల్లాలో తెలంగాణ రక్షణ సేనను మరింత బలోపేతం చేసేందుకు అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలతో కలిసి పనిచేస్తానని తెలిపారు. అన్ని మండలాల్లో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని, యువత, రైతులు, బడుగు బలహీన వర్గాల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని వివరించారు. ఈ సమావేశంలో పలు మండల, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెంకటాపూర్ లో ఓటర్ జాబితా సవరణ హియరింగ్



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో అధికారులు హియరింగ్ నిర్వహించారు. కొత్త ఓటర్ నమోదు, తొలగింపులు, సవరణలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులపై విచారణ చేపట్టారు. ఓటర్లకు జారీ చేసిన నోటీసులను క్షుణ్ణంగా పరిశీలించి, వారు సమర్పించిన ఆధార్ కార్డు, ఇతర సంబంధిత డాక్యుమెంట్లను పరిశీలించారు. అర్హులైన ఓటర్లందరినీ జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రూపావత్ వెంకటరామ్, కుంటాల(బి) సర్పంచ్ గంగారాం, ఉప సర్పంచ్ ఆడే కృష్ణ, సాయిరాం, గిర్దావర్, గ్రామ పరిపాలన అధికారి రియాజ్, జూనియర్ అసిస్టెంట్ రాజారామ్, పోశెట్టి, వినోద్, బీఎల్ఓ చంద్రకళ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా రాథోడ్ బాపురావు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జిల్లా అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావును పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత నియమిస్తూ అధికారికంగా ప్రకటించారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడం, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేయాలనే లక్ష్యంతో ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించారు. బోథ్ నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను ముందుండి నిర్వహిస్తూ, కార్యకర్తలతో నిరంతరం సమన్వయం చేసుకుంటున్న రాథోడ్ బాపురావుకు జిల్లా స్థాయి బాధ్యతలు అప్పగించడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. ఆయన నియామకంతో అనుచరులు, పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఆనందం వ్యక్తమైంది. ఈ సందర్భంగా రాథోడ్ బాపురావు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవితకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తానని, జిల్లాలోని పార్టీ నాయకులు, కార్యకర్తలందరినీ కలుపుకుని సమన్వయంతో పనిచేస్తానని తెలిపారు. పార్టీని జిల్లాలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు.

# రీ సర్వే పనులను పారదర్శకంగా చేపట్టాలి

**జిల్లా అదనపు కలెక్టర్ ఆర్ఎస్.చిత్రు**



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** రీ సర్వే పనులను పారదర్శకంగా, పొరపాట్లకు తావులేకుండా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ ( రెవెన్యూ) ఆర్.ఎస్.చిత్రు అన్నారు. మండలంలోని బుద్ధికొండ గ్రామంలో కొనసాగుతున్న రీ సర్వే పనులను మంగళవారం పరిశీలించారు. రీ సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రీ సర్వేకు సంబంధించి గ్రామంలో ఉన్న సమస్యలను గ్రామ పెద్దల ద్వారా అడిగి తెలుసుకున్నారు. వారి అభిప్రాయాలు, ఇబ్బందులను తెలుసుకుని, సర్వే ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఆయన వెంట ఏడీ ఎల్.ప్రభాకర్, తహశీల్దార్ ఎంఏ కలీమ్, మండల సర్వేయర్ శంకర్, జీపీఓ వినోద్ తదితరులు ఉన్నారు.

# ఘనంగా పాల్వాయి పురుషోత్తం రావు వర్ధంతి వేడుకలు



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** ప్రజా బంధు, మాజీ ఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తం రావు 27వ వర్ధంతిని మండల కేంద్రంలో బీజేపీ నాయకులు, ఆయన అభిమానులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ జనసేవే లక్ష్యంగా, ప్రజల కోసం ఎల్లప్పుడూ ముందుండే నాయకుడు పాల్వాయి పురుషోత్తం రావు అని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కాగజ్ నగర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని తెలిపారు. పేదల సంక్షేమం, గిరిజనుల అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత మనపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జాడి తిరుపతి, జాడి దిగంబర్, ఉమ్మెర బాలకృష్ణ, కోల కృష్ణయ్య, వసివుల్లా ఖాన్, ఏలేశ్వరం రమేష్, కిషన్ గోపాల్, నెల్లి మహేష్, తలండి మోహన్, అన్నారం తిరుపతి, పొన్న ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిషేధిత చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి





**జిల్లా కలెక్టర్ కె.హరిత**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** జిల్లాలో బాల్యవివాహాల నివారణకు, లైంగిక నేరాల నుండి బాలలను రక్షించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో పోలీస్, రెవెన్యూ, శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్య, విద్య, పంచాయతీరాజ్ శాఖల అధికారులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ వాత్సల్య కార్యక్రమం క్రింద బాల్య వివాహాల నిషేధిత చట్టం, పోక్సో చట్టాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. బాల్య వివాహాల నివారణ పై ప్రజలకు అవగాహన కల్పించాలని, బాల్య వివాహాల వలన భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలపై తల్లిదండ్రులకు వివరించాలని తెలిపారు. కిశోర బాలికల సాధికారతను సమర్థవంతంగా పర్యవేక్షించాలని, పాఠశాలలు, కళాశాలలో బాల్యవివాహాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. లైంగిక నేరాల నుండి బాలల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, లైంగిక వేధింపులు లైంగిక దాడి, అశ్లీల చిత్రాల కోసం పిల్లలను ఉపయోగించే వారిని గుర్తించి పోక్సో చట్టం క్రింద కఠినంగా శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ, మండల స్థాయిలలో కమిటీలు ఏర్పాటు చేయాలని, సర్పంచ్ లు, స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వాములు చేయాలని తెలిపారు. అనంతరం మన అంగన్వాడి - మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా పోషణ మాసం పై అధికారులతో సమీక్షించారు. ఈ నెల 9వ తేదీ నుండి వచ్చే నెల 8వ తేదీ వరకు జిల్లాలోని అన్ని అంగన్వాడి కేంద్రాలలో 9వ పోషణ మాసం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని, 3 సంవత్సరాల లోపు వయసు కలిగిన పిల్లలు అందరూ అంగన్వాడీ లలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనుబంధ పోషకాహారాలైన పప్పు, ఆకుకూరలు, చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని అందించాలని తెలిపారు. ఈ సందర్భంగా పోషణ మాసం సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వరూపారాణి, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా విద్యాధికారి సచ్చిదానంద చారి, డి సి పి ఓ మహేష్, జిల్లా మాధ్యమిక విద్యాధికారి రాందాస్, సి డి పి ఓ లు, సఖి - బాలల రక్షణ సిబ్బంది, శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మల్టీపర్పస్ వర్కర్ పై సర్పంచ్ దాడి

- న్యాయం చేయాలంటూ సీఐటీయూ ధర్నా



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండలంలోని ఊట్స్ సారంగపల్లి గ్రామపంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్ చొప్పదండి సత్తయ్యపై దాడికి పాల్పడిన సర్పంచ్ తో పాటు అతని అనుచరులపై కేసు నమోదు చేసి బాధితుడికి న్యాయం చేయాలని మల్టీపర్పస్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం బెజ్జూర్ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెరిక శ్రీకాంత్ మాట్లాడుతూ విధులు నిర్వహిస్తున్న మల్టీపర్పస్ వర్కర్ సత్తయ్యపై సర్పంచ్, అతని అనుచరులు దాడి చేయడం దారుణమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు కేసు నమోదు చేయకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు సర్పంచ్ కు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. దాడికి పాల్పడిన సర్పంచ్ తో పాటు ఆయన అనుచరులపై వెంటనే కేసు నమోదు చేసి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ ఉద్యోగులపై దాడులు పునరావృతం కాకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత వర్కర్ కు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అంతకుముందు పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మండల అభివృద్ధి కార్యాలయంలో అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బెజ్జూర్ మండల మల్టీపర్పస్ వర్కర్లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ ప్రణాళికపై ప్రత్యేక సమావేశం



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండలంలోని బెజ్జూర్, అంబగట్ట గ్రామపంచాయతీల్లో సర్పంచులు దుర్గం సరోజ, తలాంటి నాగేష్ అధ్యక్షతన వీబీజీ రామ్జీ కింద వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళిక తయారీపై మంగళవారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపీఓ రాజన్న హాజరై వీజీపీపీ లక్ష్యాలను వివరించారు. వికసిత్ భారత్ @2047 లక్ష్యానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీజీ రామ్జీ చట్టం 2002 ప్రధాన ఉద్దేశం గ్రామీణ అభివృద్ధిని వేగవంతం చేయడమేనన్నారు. ఇందులో భాగంగా శ్రమతో కూడిన పని చేయడానికి సిద్ధంగా ఉన్న ప్రతి గ్రామీణ కుటుంబానికి ప్రతి ఆర్థిక సంవత్సరంలో 125 రోజుల ఉపాధికి చట్టబద్ధమైన హామీ కల్పిస్తారని తెలిపారు. కేవలం ఉపాధిహామీ ప్రణాళిక మాత్రమే కాకుండా, గ్రామపంచాయతీ అవసరాలు, అందుబాటులో ఉన్న సహజ వనరులు, ఇప్పటికే ఉన్న ఆస్తులు, మౌలిక వసతులు, అభివృద్ధి లోటుపాట్లను గుర్తించి ప్రజల భాగస్వామ్యంతో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులను రూపొందించే సమగ్ర ప్రణాళిక అని వివరించారు. గ్రామంలోని తాగునీటి సమస్యలు, రోడ్లు, డ్రైనేజీ, పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాలు, వ్యవసాయ అనుబంధ పనులు, పశువుల షెడ్లు, చెరువుల పునరుద్ధరణ వంటి అంశాలను వీజీపీపీలో చేర్చాలని సూచించారు. అన్ని ప్రభుత్వ పథకాల సమన్వయంతో సుసంపన్నమైన, బలమైన గ్రామీణ భారత్ నిర్మాణమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు వైకుంఠం, మినహాజ్, వార్డు సభ్యులు, ఉపాధిహామీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పంట రక్షణకు విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు

**ఇచ్చోడ రూరల్ సీఐ సిహెచ్ రమేష్**



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** పంటలకు రక్షణ పేరుతో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తే హత్య నేరంతో సమానమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఇచ్చోడ రూరల్ సీఐ సిహెచ్ రమేష్ హెచ్చరించారు. రాయ్ పూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ నేరడిగొండ మండలం కుప్టి వద్ద మరమ్మతుల్లో ఉన్న బ్రిడ్జిని గమనించకుండా అతివేగంగా వెళ్లి అక్కడ ఉన్న ట్యాంకర్ ను ఢీకొట్టింది. ఆ సమయంలో బ్రిడ్జి మరమ్మతులు చేస్తున్న కార్మికులు నిద్రిస్తుండగా వారి బట్టలపై నుంచి లారీ వెళ్లింది. లారీ వేగంగా వస్తున్న విషయాన్ని గమనించిన కార్మికులు తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదంలో మనుషులు మరణించారనే భయంతో లారీ డ్రైవర్ అవదేశ్ కుమార్ యాదవ్, క్లీనర్ రూపేష్ కుమార్ (21) లారీని వదిలి పరారయ్యారు. ఈ క్రమంలో మండలంలోని గాంధారి గ్రామ శివారులో ఆత్రం చంద్రబాన్ కౌలుకు తీసుకున్న మొక్కజొన్న పంటకు రక్షణగా అక్రమంగా ఏర్పాటు చేసిన ప్రమాదకర విద్యుత్ తీగను తాకి బీహార్ రాష్ట్రానికి చెందిన లారీ క్లీనర్ రూపేష్ కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై నేరడిగొండ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి, అక్రమ విద్యుత్ తీగలు ఏర్పాటు చేసిన నేరడిగొండ మండలం గాంధారి గ్రామానికి చెందిన ఆత్రం చంద్రబాన్ వాసిపై హత్య నేరంతో సమానమైన కఠిన సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు సీఐ తెలిపారు. అదేవిధంగా ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ అవదేశ్ కుమార్ యాదవ్ పై కూడా కేసు నమోదు చేశారు. ప్రాణం కంటే పంట ముఖ్యం కాదని, పంటలకు రక్షణగా ఏర్పాటు చేసే అక్రమ విద్యుత్ తీగలతో ప్రాణనష్టం జరుగుతోందని, జిల్లాలో ఇప్పటికే ఇలాంటి ఘటనలు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఎవరూ తమ పొలాలకు ప్రమాదకర విద్యుత్ తీగలు ఏర్పాటు చేయవద్దని, అలాంటి తీగలు ఎక్కడైనా ఉంటే సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎస్సై ఇమ్రాన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** పట్టణంలోని అశోక్నగర్ కాలనీలో ఐదేళ్ల బాలికపై మేనమామ అత్యాచారానికి పాల్పడిన ఘటనను ఖండిస్తూ ఏఐడీడబ్ల్యూఏ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం డీఎస్పీకి వినతిపత్రం అందజేశారు. నిందితుడిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత బాలికకు పూర్తి రక్షణ కల్పించడంతో పాటు కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. చిన్నారులపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసు శాఖ కఠిన చర్యలు చేపట్టాలని అన్నారు. మహిళలు, బాలికల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కాగజ్నగర్ ప్రాంతంలో మద్యం, గంజాయి విక్రయాలను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై యువతలో అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐడీడబ్ల్యూఏ ప్రధాన కార్యదర్శి దుర్గం అనిత, కోశాధికారి షాహీన్ సుల్తాన, సులోచన, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్, మాదారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విశ్వేశ్వరయ్య సేవలు స్ఫూర్తిదాయకం

**సత్తుపల్లి ఏరియాలో ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** భారత ప్రముఖ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు, ఇంజనీరింగ్ రంగానికి ఆయన చేసిన కృషి స్ఫూర్తిదాయకమని సింగరేణి అధికారులు పేర్కొన్నారు. సత్తుపల్లి ఏరియాలో మంగళవారం ఇంజనీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కొప్పుల వెంకటేశ్వర్లు, సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ సిరికొండ వెంకటాచారి, జేవీఆర్ ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్వీఆర్ ప్రహ్లాద్ జేవీఆర్ ఓసీని సందర్శించారు. అనంతరం ఏరియా జీఎం కార్యాలయంలో నిర్వహించిన ఇంజనీర్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంజనీరింగ్ రంగంలో విశ్వేశ్వరయ్య అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టూ జీఎం బొల్లం శ్రీనివాస్, కిష్టారం ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్, సీఎంఓఏఐ, సత్తుపల్లి ఏరియా ప్రెసిడెంట్ ఏఎల్ఎస్వీ సునీల్ వర్మ, ఏరియా ఇంజనీర్ కె. సోమశేఖరరావు, ఎస్ఈ (ఈఅండ్ఎం) జేవీఆర్ సీహెచ్పీ పి. సాయినాథ్, ఎస్ఈ (ఈఅండ్ఎం)/పర్చేజ్ ఆఫీసర్ ఎం. మోహన్, ఎస్ఓఎం కిష్టారం ఓసీ బి. రామకృష్ణ, పర్సనల్ మేనేజర్ ఎల్. తిరుపతి, సీనియర్ పీవో ఎం. మురళి, వెల్ఫేర్ ఆఫీసర్ కె. శ్రీనివాస్తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# వ్యభిచార ముఠా నిర్వాహకుడిపై పీడీ యాక్ట్

**చంచల్గూడ జైలుకు తరలింపు**



**ఉద్యమ కెరటం, ఖమ్మం:** మహిళలను వ్యభిచారంలోకి దింపుతూ ఆర్థిక లాభాలు పొందుతున్న బత్తుల బాలకృష్ణపై పీడీ యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ముదిగొండ మండలం చిరుమర్రి గ్రామానికి చెందిన బాలకృష్ణ జిల్లాలో వ్యభిచార గృహాలు నిర్వహిస్తూ మహిళలను వ్యభిచారంలోకి తీసుకువస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు. బాలకృష్ణపై ఖమ్మం టూటౌన్, త్రీటౌన్లలో అనైతిక రవాణా, వ్యభిచార నిరోధక చట్టం కింద కేసులు నమోదయ్యాయని తెలిపారు. జనవరి 6న గాంధీచౌక్లోని ఓ లాడ్జిపై పోలీసులు దాడి చేయగా, వ్యభిచార కార్యకలాపాల కోసం ఓ గదిని అధిక మొత్తంలో డబ్బు చెల్లించి తీసుకున్నట్లు గుర్తించారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో బాలకృష్ణతో పాటు మెరెడ్డి సత్యవతి, లాడ్జి మేనేజర్ అలకుంట్ల శ్రీకాంత్ కలిసి వ్యవహరించినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. కాకినాడకు చెందిన ఓ మహిళ ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకుని ఆమెను వ్యభిచారంలోకి దింపి ఖమ్మంకు తీసుకొచ్చి లాడ్జి గదిలో ఉంచి కస్టమర్ల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు తెలిపారు. నిందితుడి నేరప్రవృత్తిని అరికట్టడంతో పాటు శాంతిభద్రతలను పరిరక్షించేందుకు ప్రమాదకర కార్యకలాపాల నిరోధక చట్టం కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. అనంతరం బాలకృష్ణను చంచల్గూడ సెంట్రల్ జైలుకు తరలించినట్లు వివరించారు.

# మాల ధరించిన విద్యార్థులకు అనుమతి నిరాకరణ

**హార్వెస్ట్ కళాశాల వద్ద నిరసన.. కొంతసేపు ఉద్రిక్తత**





**ఉద్యమ కెరటం, ఖమ్మం:** ఖమ్మం నగరంలోని మమత రోడ్డులో ఉన్న హార్వెస్ట్ జూనియర్ కళాశాలలో వినాయక మాల ధరించి కళాశాలకు వచ్చిన ఆరుగురు ఇంటర్ విద్యార్థులను తరగతుల్లోకి అనుమతించకుండా ఇళ్లకు పంపించిన ఘటన వివాదాస్పదంగా మారింది. వినాయక చవితి సందర్భంగా విద్యార్థులు మాల ధరించి కళాశాలకు హాజరయ్యారు. అయితే మాల ధరించి తరగతులకు హాజరు కావడానికి యాజమాన్యం అనుమతించలేదని విద్యార్థుల కుటుంబ సభ్యులు ఆరోపించారు. మాలను తొలగించిన తర్వాతే కళాశాలలోకి అనుమతిస్తామని చెప్పడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల కుటుంబ సభ్యులతో పాటు బీజేపీ, ఏబీవీపీ నాయకులు కళాశాల వద్దకు చేరుకుని నిరసన చేపట్టారు. మాల ధరించిన విద్యార్థులను తరగతులకు అనుమతించాలని, వారి విద్యకు ఆటంకం కలిగించవద్దని డిమాండ్ చేశారు. దీంతో కళాశాల వద్ద కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

# తెలంగాణలో నడుస్తోంది రాజ్యాంగం కాదు.. రేవంత్రెడ్డి చట్టం

- హోంమంత్రిగా రేవంత్రెడ్డి రాజీనామా చేయాలి
- సైఫాబాద్ ఘటనపై సిట్ వేయాలి.. సీసీ ఫుటేజీ విడుదల చేయాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్కుమార్

**ఉద్యమ కెరటం, హైదరాబాద్:** తెలంగాణలో నడుస్తోంది రాజ్యాంగం కాదని.. రేవంత్రెడ్డి చట్టమని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్కుమార్ ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, హోంశాఖను నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సైఫాబాద్ పోలీస్ స్టేషన్లో మాస్కులు ధరించిన కొందరు వ్యక్తులు చొరబడి దాడికి ప్రయత్నించిన ఘటన దేశ వ్యాప్తంగా సిగ్గుపడేలా ఉందన్నారు. పోలీస్ స్టేషన్లోకి మాస్కులు ధరించి వచ్చిన వ్యక్తులను పోలీసులు ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. వారు ఎవరు.. ఎక్కడి నుంచి వచ్చారు.. ఎందుకు వచ్చారనే వివరాలను పోలీసులు ఎందుకు తెలుసుకోలేదని నిలదీశారు. దాడికి ప్రయత్నించిన వారు స్థానికులేనని పోలీసులు చెబుతున్నప్పటికీ వారిని ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. ఒకప్పుడు తెలంగాణ పోలీసులు దేశంలోనే నంబర్వన్గా గుర్తింపు పొందారని, ఉగ్రవాదం, నక్సలిజం నియంత్రణ, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, క్లిష్టమైన కేసుల దర్యాప్తులో రాష్ట్ర పోలీసులకు మంచి పేరు ఉండేదన్నారు. ప్రస్తుతం పోలీసులను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. ఈనెల 7న అసెంబ్లీకి వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అడ్డుకుని మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు అనుచితంగా వ్యవహరించారని ఆరోపించారు. ఎమ్మెల్సీలతో పాటు ప్రజా ప్రతినిధులపై జరిగిన తోపులాటలు, దాడులు ముందస్తు ప్రణాళికలో భాగమేనన్నారు. కేటీఆర్ పీఏ, పీఆర్వోలపై మఫ్టీలో ఉన్న పోలీసులు దురుసుగా వ్యవహరించారని, పోలీసుల తీరును ప్రశ్నించినందుకు వారిపైనే కేసులు నమోదు చేశారని తెలిపారు. కేటీఆర్ పీఆర్వో, పీఏ మహేష్, మహేందర్రెడ్డిలను సైఫాబాద్ పోలీసులు విచారణకు పిలిచారని, వారు ఉదయం 9గంటలకు పోలీస్ స్టేషన్కు వెళ్లినా మధ్యాహ్నం వరకు దర్యాప్తు అధికారి అందుబాటులో లేరని అన్నారు. విచారణ పూర్తయినప్పటికీ వారిని సాయంత్రం వరకు ఇంటికి పంపకుండా అక్కడే ఉంచారని ఆరోపించారు.



అనంతరం సుమారు 30 మంది బయట మాస్కులు ధరించి తిరుగుతున్నారని, వారిలో 15 మంది ఒక్కసారిగా పోలీస్ స్టేషన్లోకి ప్రవేశించి మహేందర్రెడ్డిపై దాడికి ప్రయత్నించారని తెలిపారు. దాడికి ప్రయత్నించిన వారిని ఎస్సై సత్యనారాయణ అడ్డుకోవడంతో వారు అక్కడి నుంచి పారిపోయారని అన్నారు. వారు పారిపోతుంటే పోలీసులు ఎందుకు పట్టుకోలేదని ప్రశ్నించారు. పోలీస్ స్టేషన్లో జరిగిన ఘటనపై బాధితులు, న్యాయవాదులు ఫిర్యాదు చేసినప్పటికీ ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదన్నారు. కనీసం గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి దాడికి ప్రయత్నించారనే అంశంపై పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేయవచ్చని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఇచ్చిన పలు ఫిర్యాదులపై పోలీసులు కేసులు నమోదు చేయడం లేదని విమర్శించారు. మరోవైపు తమ పార్టీ నాయకులపై మాత్రం వెంటనే కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. పోలీసు వ్యవస్థలో నిబంధనలు, చట్టాలు అమలవుతున్నాయా అని ప్రశ్నించారు. సైఫాబాద్ పోలీస్ స్టేషన్పై దాడి ఘటనలో పాల్గొన్న వారిని వెంటనే అరెస్ట్ చేయాలని, ఘటనపై ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పోలీస్ స్టేషన్లోని సీసీ ఫుటేజీని బహిర్గతం చేయాలని కోరారు. తెలంగాణలో అరాచక పాలన కొనసాగుతోందని, కొందరు పోలీసులు రాజకీయ ఆదేశాలతో అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# పార్టీ బలోపేతానికి సమన్వయంతో పనిచేయాలి

**ఆసిఫాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ శ్యామ్ నాయక్**



**ఉద్యమ కెరటం, జైనూర్:** పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆసిఫాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ శ్యామ్ నాయక్ సూచించారు. మంగళవారం జైనూర్ మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా జైనూర్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని సందర్శించి నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. మండలంలో పార్టీ కార్యకలాపాలు, గ్రామస్థాయిలో కాంగ్రెస్ను బలోపేతం చేయడం, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, పార్టీ కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. ప్రతి గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పేర్కొన్నారు. పార్టీ విధానాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ నాయకత్వం ఇచ్చే సూచనలను పాటిస్తూ ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జైనూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ రషీద్, డీసీసీ కార్యవర్గ సభ్యులు పెందుర్ ప్రకాష్, దుర్రే సుభాష్, పవర్గూడ సర్పంచ్ తొడసం రాజేందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉచిత యూనిఫామ్స్ పంపిణీ



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ప్రారంభించిన ఉచిత యూనిఫామ్ పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా వేంసూర్ గ్రామంలోని అప్పర్ ప్రైమరీ పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఎండీ ఫకృద్దీన్ చేతుల మీదుగా విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఫకృద్దీన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా యూనిఫామ్స్ అందించడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గుతుందని అన్నారు. యూనిఫామ్ విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు పాఠశాలలకు హాజరు శాతం కూడా మెరుగుపడుతుందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారిని నిరంతరం ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అలవాలా పుల్లమ్మ, ఉపాధ్యాయులు నందికొల్లా మాధవి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మిర్చి కొనుగోళ్లపై ట్రేడర్లతో చర్చ



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా వైరా మార్కెట్ కమిటీలో మిర్చి క్రయవిక్రయాలకు సంబంధించిన అంశాలపై మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు కాపా సుధాకర్ ఆధ్వర్యంలో మంగళవారం ట్రేడర్లతో చర్చ నిర్వహించారు. మిర్చి క్రయవిక్రయాల పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, మార్కెట్లో కొనుగోళ్ల ప్రక్రియ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కాపా సుధాకర్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మిర్చి క్రయవిక్రయాలు పారదర్శకంగా, సజావుగా జరిగేలా ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. రైతుల శ్రమకు తగిన గిట్టుబాటు ధర లభించేలా వ్యాపారులు సహకరించాలని కోరారు. మార్కెట్లో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులకు తావులేకుండా రైతులు, వ్యాపారులు, మార్కెట్ నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రైతులు తమ పంటను మార్కెట్కు తీసుకొచ్చిన సమయంలో కొనుగోళ్లు, భద్రత, ఇతర సౌకర్యాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైరా మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ల గంగారావు, కోల్డ్ స్టోరేజీ యజమానులు, మిర్చి ట్రేడర్లు పాల్గొన్నారు.

# ఆటో కార్మికుల హక్కుల కోసం పోరాటం

- టీయూసీఐలో ఆటో యూనియన్ విలీనం

**ఉద్యమ కెరటం, సిర్పూర్(యు):** ఆటో కార్మికుల హక్కుల కోసం పోరాటాలు చేస్తామని టీయూసీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు జగన్సింగ్ అన్నారు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యు) మండల ఆటో యూనియన్ ట్రేడ్ యూనియన్ సెంట్రల్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) అనుబంధ తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్లో విలీనమైంది. మంగళవారం సిర్పూర్(యు)లో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ఆటో కార్మికులు యూనియన్లో చేరారు. ఆటో యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు జె. దళిత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్సై కొమురయ్య, గ్రామపంచాయతీ



సర్పంచ్ ఆత్రం ఓం ప్రకాశ్ పాల్గొన్నారు. అనంతరం జగన్సింగ్ మాట్లాడుతూ ఆటో కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. పెరుగుతున్న ఇంధన ధరలు, నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా ఆటో ఛార్జీలను పెంచాలని, కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిర్పూర్(యు) మండల ఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజమల్లె హనుమంతు, ఉపాధ్యక్షులుగా షేక్ నైమ్, మజీద్ ఖాన్, ప్రధాన కార్యదర్శిగా మడవి దేవుషా, సహాయ కార్యదర్శులుగా మడవి దత్తు, మేస్రం శ్రీదేవి, ప్రహ్లాద్, అకౌంటెంట్లుగా షేక్ కరీం, గేడం జ్యోతిరామ్ ఎన్నికయ్యారు. సలహాదారులుగా షేక్ రషీద్, కోవ లింగు, సర్వర్ ఖాన్, సభ్యులుగా వేడమా మోహన్, షేక్ అర్బాజ్, సీడం ప్రకాశ్ తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎస్కే షకీల్, టీయూసీఐ జిల్లా నాయకులు, ఆటో డ్రైవర్లు, కార్మికులు పాల్గొన్నారు.

# త్రీడి ప్రింటింగ్ నైపుణ్యాలతో విద్యార్థులకు సరికొత్త అవకాశాలు

**ఉద్యమ కెరటం, నర్సాపూర్:** ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు ఆచరణాత్మక అవగాహన కల్పించేందుకు మెదక్ జిల్లా నర్సాపూర్ సమీపంలోని బీవీ రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీవీఆర్ఐటీ)లో ఐదు రోజుల త్రీడి ప్రింటింగ్, అడిటివ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ హ్యాండ్స్-ఆన్ శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈనెల 15 నుంచి 19 వరకు ఫార్మాస్యూటికల్ ఇంజినీరింగ్ విభాగం, ఏఐసీటీఈ-ఐడియా ల్యాబ్, డిజైన్ ల్యాబ్స్ సంయుక్తంగా ఈ శిక్షణ నిర్వహిస్తున్నాయి. ఐఐటీ పాలక్కాడ్కు చెందిన డాక్టర్ కన్మణి సుబ్బు ఎస్. ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు త్రీడి ప్రింటింగ్ సాంకేతికతపై అవగాహన కల్పించారు. పరిశోధన, ఆవిష్కరణలు, పారిశ్రామిక రంగాల్లో త్రీడి ప్రింటింగ్ వినియోగం, భవిష్యత్ అవకాశాలను వివరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పుస్తకాలకే పరిమితం చేయకుండా ఆచరణాత్మకంగా నేర్చుకోవడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని, నూతన ఆవిష్కరణలకు మార్గం సుగమమవుతుందని పేర్కొన్నారు. శిక్షణలో భాగంగా త్రీడి డిజైనింగ్, ప్రింటింగ్, ప్రోటోటైప్ అభివృద్ధి తదితర అంశాల్లో విద్యార్థులకు ప్రత్యక్ష శిక్షణ అందిస్తున్నారు. సాంకేతిక నైపుణ్యాలతో పాటు సృజనాత్మక ఆలోచనలు, పరిశోధన దృక్పథం, ఆవిష్కరణలపై ఆసక్తిని పెంపొందించడమే కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దూబే, మేనేజింగ్




డైరెక్టర్ బాపిరాజు, డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్, డీన్ డాక్టర్ వి. మురళీకృష్ణ, డాక్టర్ ఎం.సుధీర, సురేష్, మల్లికార్జున్, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలి

**జిల్లా వ్యవసాయ అధికారి వెంకట్**

**ఉద్యమ కెరటం, కౌటాల:** రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని క్రమంగా తగ్గించి రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.వెంకట్ సూచించారు. ప్రకృతి వ్యవసాయంతో నేల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ (ఎన్ఎంఎన్ఎఫ్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎంఎన్ఎఫ్ కింద ఎంపికైన ముత్యంపేట గ్రామ రైతులకు ప్రకృతి



వ్యవసాయ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజామృతం, జీవామృతం, ఘనజీవామృతం, నీమాస్త్రం, అగ్నాస్త్రం, దశపర్ణి కషాయాల తయారీ, వినియోగం, ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. పంటల వైవిధ్యం, పశువులు—చెట్ల అనుసంధానం, నేలలో సేంద్రియ పదార్థాన్ని పెంపొందించడం, సహజ ద్రావణాలతో తెగుళ్లు, వ్యాధులను నివారించే విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు జి.ఘనశ్యామ్, ఎస్.సాగర్, ఎం.రాజేశ్వరి, ఆర్.రేష్మిత, ఎస్.కల్పన, ఏఎంసీ డైరెక్టర్ కె.సత్యనారాయణ, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ ఎ.రామకృష్ణ, నాయకులు బంధురావు, మోతీరాం, కృషి సఖీలు, రైతులు పాల్గొన్నారు.

# భారీగా గంజాయి మొక్కల స్వాధీనం

- రూ.1.25 కోట్ల విలువైన పంట ధ్వంసం.. ఇద్దరు అదుపులో



**ఉద్యమ కెరటం, జైనూర్:** గంజాయి అక్రమ సాగుపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. జైనూర్ మండలం పట్నాపూర్ గ్రామ శివారులో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో భారీగా గంజాయి మొక్కలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఓ వ్యక్తి తన పొలంలో అంతర పంటగా గంజాయి సాగు చేస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. పోలీసులు చేపట్టిన దాడుల్లో సుమారు 1,500 గంజాయి మొక్కలను గుర్తించి ధ్వంసం చేశారు. వీటి విలువ సుమారు రూ.1.25 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. అక్రమ సాగుకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్, డీఎస్పీలు మంగళవారం వివరాలు వెల్లడించారు. జిల్లాలో గంజాయి సాగు, రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని తెలిపారు. మత్తు పదార్థాలతో యువత భవిష్యత్తు దెబ్బతింటుందని, అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి సాగు, మత్తు పదార్థాల అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. అక్రమ సాగును పూర్తిగా అరికట్టేందుకు నిరంతరం నిఘా కొనసాగిస్తామని తెలిపారు. దాడిలో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించారు.

# తెలంగాణ ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్

**ఉద్యమ కెరటం, తాండూర్:** సెప్టెంబర్ 17 తెలంగాణ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను అధికారంకంగా నిర్వహించకుండా తెలంగాణ ప్రజలను కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు వంచనకు గురిచేశాయని బీజేపీ నాయకులు అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవం రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక డిప్యూటీ తహశీల్దార్ కల్పనకు వినపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణతో పాటు స్వాతంత్రం వచ్చిన ప్రాంతాలు కర్ణాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు స్వాతంత్ర దినోత్సవ వేడుకలు అధికారికంగా నిర్వహిస్తున్నాయని తెలిపారు. తెలంగాణలో రాజకీయ పార్టీలు మైనార్టీ సంతుష్టీకరణ



విధానం అవలంభిస్తూ ఈ వేడుకలను నిర్వహించడంలో అలసత్వం వహిస్తున్నాయని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ తెలంగాణ ప్రజలకు సెప్టెంబర్ 17 అధికారికంగా నిర్వహిస్తామని ప్రకటించి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేవలం గోల్కొండ ఖిలాపై ఉత్సవాలు నిర్వహించి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రజాపాలన దినోత్సవం పేరుతో అసలైన స్వాతంత్ర దినోత్సవ వేడుకలను మరుగున పడేయడానికి ప్రయత్నం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల అభీష్టం మేరకు కేంద్ర ప్రభుత్వం 2023 నుంచి హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్లో తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగ నిర్వహిస్తుందని, ఇదే తరహాలో రాష్ట్ర ప్రభుత్వం కూడా అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మండల బీజేపీ అధ్యక్షులు దూడపాక భరత్ కుమార్, జిల్లా కార్యదర్శి రామగౌని మహిధర్ గౌడ్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్ధం మల్లేష్, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్, మండల కార్యదర్శి గాదె రాజేశం, సీనియర్ నాయకులు కోమండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# చెన్నూర్ను ఆధునిక పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- రూ.70 కోట్లతో గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులు
- రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** చెన్నూర్ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి ఆధునిక పట్టణంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద తెలిపారు. 2027 జూలైలో జరిగే గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. మంగళవారం చెన్నూర్లో పుష్కర ఘాట్ నిర్మాణానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, నీటిపారుదల శాఖ అధికారి విష్ణు, తహశీల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, మున్సిపల్ చైర్పర్సన్ పెద్దింటి పద్మతో కలిసి మంత్రి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు. ఇందులో భాగంగా చెన్నూర్లో సుమారు రూ.70 కోట్లతో మౌళిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సుమారు రూ.8 కోట్లతో పుష్కర ఘాట్లు, స్నానపు గదులు, రహదారులు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నామని, పుష్కరాలకు దాదాపు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున తాగునీరు, పారిశుద్యం, లైటింగ్, పార్కింగ్ వంటి సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని చెప్పారు. అంబేద్కర్ విగ్రహం నుంచి చెన్నూర్ వరకు రూ.5.50 కోట్లతో రోడ్డు విస్తరణ, లైటింగ్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అమృత్ 2.0 పథకం కింద సుమారు రూ.30 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ప్రతి ఇంటికీ నల్లా ద్వారా తాగునీరు అందించేలా చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు. చెన్నూర్ పెద్ద చెరువును సుమారు రూ.17 కోట్లతో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, శివ్వారం గోదావరి మొసళ్ల మడుగు ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, చెన్నూర్లోని అంబ అగస్తేశ్వర ఆలయ అభివృద్ధి, పునర్నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రోడ్డు విస్తరణలో దుకాణాలు కోల్పోయే చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ దుకాణాలు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని, డీఎంఎఫ్టీ నిధులతో పేదలు, చిరు వ్యాపారులకు ప్రయోజనం కలిగేలా రూ.1.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. పుష్కరాల నాటికి అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేసి భక్తులకు సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. చెన్నూర్లో నిర్మించిన వంద పడకల ఆసుపత్రిని ఈ నెలలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అనంతరం పుష్కర ఘాట్లోని హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించారు. బొక్కలగూడెంలో గౌడ సంఘం కమ్యూనిటీ భవనానికి భూమిపూజ చేసి రూ.30 లక్షలతో భవనం నిర్మించనున్నట్లు తెలిపారు. అర్హులైన పేద గౌడ కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇదిలా ఉండగా మందమర్రి మండలం రామకృష్ణాపూర్లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 'షేర్ ద విజన్–ఖమ్మం' సంస్థ అందించిన వాటర్ బాటిళ్లు, నోట్ పుస్తకాలు, క్రీడా సామగ్రితో కూడిన కిట్లను మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సేవా సంస్థలు సహకారం అందించడం అభినందనీయమని మంత్రి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో రూఫింగ్ పనులకు రూ.30 లక్షల డీఎంఎఫ్టీ నిధులు మంజూరు చేశామని, విద్యార్థుల కోసం ఆర్ఓ ప్లాంట్లు, యూనిఫాంలు, కాస్మెటిక్ ఛార్జీలు, క్రీడా సామగ్రి వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. మెస్ ఛార్జీలను 40 శాతం పెంచడంతో పాటు ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టి నాణ్యమైన విద్య అందిస్తున్నామని చెప్పారు. సోమనపల్లిలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, చెన్నూర్ డిగ్రీ కళాశాల అభివృద్ధి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సోమనపల్లిలో సుమారు రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగిందని, 100 మందికి పైగా విద్యార్థులున్న పాఠశాలల్లో ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, యూనిఫాంలు, పుస్తకాలు అందిస్తున్నామని, జిల్లాలో లెర్నింగ్ అవుట్కమ్స్ మెరుగ్గా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# హైమన్డార్ఫ్ దంపతులకు ఎమ్మెల్యేల ఘన నివాళులు

**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని చారిత్రక మార్లవాయి గ్రామాన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్, ఆయన సతీమణి, మహబూబాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు భూక్య ఉమా మంగళవారం సందర్శించారు. గ్రామ సర్పంచ్ కనక ప్రతిభ ఆధ్వర్యంలో గ్రామస్తులు వారికి ఆదివాసీ సాంప్రదాయ పద్ధతుల్లో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆదివాసీ ఆత్మబంధువులు ప్రొఫెసర్ క్రిస్టోఫ్ వాన్ ఫ్యూరర్-హైమన్డార్ఫ్, బెట్టి ఎలిజబెత్ హైమన్డార్ఫ్ దంపతుల విగ్రహాలకు ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షురాలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీల జీవన విధానం, సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణతో పాటు వారి అభివృద్ధికి హైమన్డార్ఫ్



దంపతులు చేసిన సేవలను స్మరించుకున్నారు. మార్లవాయి మ్యూజియం, హైమన్డార్ఫ్ రీడింగ్ రూమ్, గ్రామపంచాయతీ కార్యాలయం, పద్మశ్రీ కనకరాజు గుస్సాడి శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. గ్రామ చరిత్ర, ఆదివాసీ సంస్కృతి, గుస్సాడి కళకు సంబంధించిన వివరాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు పటేల్, డాక్టర్ భూక్యా మురళి నాయక్, డీసీసీ అధ్యక్షురాలు భూక్య ఉమాలను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. మార్లవాయి వంటి చారిత్రక ఆదివాసీ గ్రామాల సంస్కృతి, సాంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించేలా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ ఆత్రం మాణిక్ రావు, హన్మంత్ రావు, ఉపసర్పంచ్ ఆత్రం రాజేశ్వర్, కనక జంగు, సోయం బారీక్ రావు, నెత్తుబాయి రాము తదితర గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువత, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆదివాసీ హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలి

- హైమెండార్ఫ్ దంపతులకు మైపతి అరుణ్కుమార్ ఘన నివాళులు





**ఉద్యమ కెరటం, జైనూర్:** ఆదివాసీ హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మైపతి అరుణ్కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని చారిత్రక మార్లవాయి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆదివాసీ ఆత్మ బంధువులుగా గుర్తింపు పొందిన ప్రొఫెసర్ క్రిస్టోఫ్ వాన్ ఫ్యూరర్-హైమెండార్ఫ్, బెట్టి ఎలిజబెత్ హైమెండార్ఫ్ దంపతుల స్మారక స్థలాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఆదివాసీ సమాజ అభివృద్ధి కోసం హైమెండార్ఫ్ దంపతులు చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. వారి పరిశోధనలు, నివేదికలు, ఆదివాసీల జీవన పరిస్థితులపై చేసిన అధ్యయనాలను పరిగణనలోకి తీసుకుని ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. జల్ జంగల్ జమీన్, విద్య, వైద్యం, ఆరోగ్యం, ఉపాధి, ఉద్యోగాలు తదితర హక్కుల సాధన కోసం ఆదివాసీలు ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. ఆదివాసీలకు రాజ్యాంగబద్ధంగా కల్పించిన హక్కులు పూర్తిస్థాయిలో అమలయ్యేలా ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

### ఐటీడీఏలకు పూర్వ వైభవం తీసుకురావాలి..

ఆదివాసీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన ఐటీడీఏ వ్యవస్థకు పూర్వ వైభవం తీసుకురావాల్సిన అవసరం ఉందని అరుణ్కుమార్ అన్నారు. ఐటీడీఏ మార్చ్ను విజయవంతం చేసి ఆదివాసీ ప్రాంతాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనాలని కోరారు. విద్య, వైద్యం, ఉపాధి, అటవీ హక్కులు, భూమి హక్కుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్లవాయి గ్రామపంచాయతీ సర్పంచ్ కనక ప్రతిభ, గ్రామ పటేల్ ఆత్రం మాణిక్రావు, సార్మేడి గేడం గణపత్, తుడుందెబ్బ రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు, విద్యార్థి సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు, ఆదివాసీ నాయకులు, యువత పాల్గొన్నారు.

# కొడ్చిరాలో డెంగ్యూ కలకలం

## ఇద్దరికి నిర్ధారణ



**ఉద్యమ కెరటం, మద్నూర్:** మద్నూర్ మండలం కొడ్చిరా గ్రామంలో ఇద్దరు వ్యక్తులకు డెంగ్యూ నిర్ధారణ కావడంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. పీహెచ్సీ డోంగ్లీ మెడికల్ ఆఫీసర్ శ్రీలేఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య బృందం మంగళవారం గ్రామాన్ని సందర్శించింది. గ్రామపంచాయతీ సహకారంతో ఇళ్లు, మురుగు కాల్వలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమల నివారణ మందును స్ప్రే చేయించారు. అనంతరం పీహెచ్సీ సిబ్బంది శివయ్య గ్రామంలో పర్యటించి డెంగ్యూ బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారికి అవసరమైన చికిత్స అందించడంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమతెరలు వినియోగించాలని వైద్య అధికారులు సూచించారు. జ్వరం, ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని పీహెచ్సీని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్సీ సిబ్బంది శివయ్య, రాజమణి, ఆశా కార్యకర్తలు, గ్రామపంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# చదువుకున్న బడికి రూ.5 కోట్ల నిధులు

## జ్ఞాపకాల ఒడిలో మునిగిపోయిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



**ఉద్యమ కెరటం, కామారెడ్డి:** జీవితంలో ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా తాను చదువుకున్న పాఠశాలను, అక్కడి జ్ఞాపకాలను మరచిపోలేమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. తాను విద్యనభ్యసించిన కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన జరిపారు. ఇన్చార్జి మంత్రి సీతక్క, జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ 1971లో తాను ఈ పాఠశాలలో విద్యనభ్యసించానని, తన జీవితానికి పునాది వేసిన ఈ బడికి ఏదైనా మంచి చేయాలనే కోరిక ఎప్పటి నుంచో ఉందన్నారు. తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను, తోటి విద్యార్థులను, పాఠశాల జ్ఞాపకాలను ఎప్పటికీ మరచిపోలేనని తెలిపారు. ఎన్నో ఏళ్ల తర్వాత తాను చదువుకున్న అదే పాఠశాలకు వచ్చి పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రస్తుత విద్యార్థులను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పాఠశాల భవనం మారుతున్నా, తనకు బడి అందించిన జ్ఞాపకాలు మాత్రం ఎప్పటికీ మారవని భావోద్వేగంగా పేర్కొన్నారు. కామారెడ్డి బాయ్స్ స్కూల్ అభివృద్ధి అవసరాలను ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయించేందుకు ప్రత్యేకంగా కృషి చేసినట్లు తెలిపారు. పాత భవనాన్ని తొలగించి ఆధునిక ప్రమాణాలతో నూతన భవనాన్ని నిర్మించనున్నట్లు చెప్పారు. ఆధునిక తరగతి గదులు, డిజిటల్ విద్యా సౌకర్యాలు, కంప్యూటర్ ల్యాబ్లు, ప్రయోగశాలలు, ఇతర మౌలిక వసతులతో పాఠశాలను తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. ఇన్చార్జి మంత్రి సీతక్క మాట్లాడుతూ చదువుకున్న పాఠశాలను గుర్తుంచుకుని దాని అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని కొనియాడారు. రూ.5 కోట్ల నిధులు తీసుకురావడంలో షబ్బీర్ అలీ ప్రత్యేక శ్రద్ధ చూపారని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎంపీ సురేష్కుమార్ షెట్కర్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి షబ్బీర్ అలీ చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమన్నారు. ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ నూతన భవనం నిర్మాణంతో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం అందుబాటులోకి వస్తుందని అన్నారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాఠశాల అభివృద్ధికి రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయించేందుకు షబ్బీర్ అలీ చేసిన కృషిని అభినందించారు. తాను చదువుకున్న పాఠశాలను మరచిపోకుండా దాని అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు తీసుకురావడంతో పాటు ఆధునిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్న షబ్బీర్ అలీని పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు. చదువు నేర్పిన బడికి రుణం తీర్చుకోవాలనే గొప్ప మనసుకు ఇది నిదర్శనమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గణేష్ మండపాల వద్ద జాతీయ జెండా ఎగురవేయాలి



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17న ప్రతి గణేష్ మండపం వద్ద జాతీయ జెండాను ఎగురవేయాలని ఆర్ఎస్ఎస్ కరీంనగర్ విభాగ్ సహ కార్యవాహ ప్రముఖ్ రంగస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సంతోష్ ఫంక్షన్ హాల్లో గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గణేష్ నవరాత్రులు, నిమజ్జన కార్యక్రమాలను నిర్వాహకులు ఐకమత్యంతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు తాటి శ్రీనివాస్ మాట్లాడుతూ మండపాల నిర్వాహకులకు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈనెల 25న గణేష్ నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. నిమజ్జన శోభయాత్రను పోలీసు అధికారులు సూచించిన మార్గంలో శాంతియుతంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి అరుణ్ లోయా, కోశాధికారి దెబ్బటి శ్రీనివాస్, హిందూ జాగరణ్ మంచ్ జిల్లా అధ్యక్షుడు శివగౌడ్, సమితి సభ్యులు, గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.



## తీవ్ర దుమారం రేపుతున్న
# స్పోర్ట్స్ యాప్ యాడ్

**న్యూయార్క్:** అమెరికా నటి సిడ్నీ స్వీనీతో చేసిన ఓ యాడ్ తీవ్ర దుమారం రేపుతున్నది. క్రీడల్లోని మహిళలను శృంగారభరితంగా చూపిస్తున్నట్లు ఆ యాడ్ ఉందని విమర్శలు వస్తున్నాయి. స్పోర్ట్స్ మార్కెట్ ట్రేడింగ్‌కు చెందిన నోవిగ్ యాప్‌ను నటి సిడ్నీ ప్రమోట్ చేసింది. ఆ ప్రకటనలో ఆమె దాదాపు నగ్నంగా నటించింది. అయితే ఫుట్‌బాల్‌తో పాటు ఇతర క్రీడా వస్తువులతో ఆమె తన శరీరాన్ని కప్పుకుని ట్రేడింగ్ యాప్‌ను ప్రమోట్ చేసింది. ఇక సోషల్ మీడియాలో అనేక మంది మహిళా అథ్లెట్లు ఆ యాడ్‌ను తప్పుపట్టాడు. మహిళలను అగౌరవపరుస్తున్నారని ఆరోపించారు. నాలుగు సార్లు ఒలింపిక్ స్విమ్మింగ్‌లో గోల్డ్ మెడల్ గెలిచిన ఏరియార్నే టిట్‌మస్ స్పందిస్తూ ఆ యాడ్‌ను చూస్తున్నప్పుడు ఆవేశం వస్తున్నట్లు ఆమె అన్నారు. స్త్రీ శరీరాలను డబ్బు సంపాదన కోసం వాడుతుంటే, మహిళా క్రీడలు ఎలా వృద్ధి చెందుతాయని ఆమె ప్రశ్నించారు. బ్రిటీష్ స్ప్రింటర్ ఆమే హంట్, యూఎస్ జిమ్నాస్ట్ గ్రేసీ క్రామర్ కూడా ఆ యాడ్‌ను తప్పుపట్టారు. రగ్బీ ప్లేయర్ సోఫీ ఫెల్లా స్పందిస్తూ.. సిడ్నీ నటించిన యాడ్ మహిళలను కించపరిచే రీతిలో ఉన్నట్లు పేర్కొన్నది. నటి స్వీనీ గతంలో రెండు సార్లు ఎమ్మీ అవార్డుకు నామినేట్ అయ్యింది. అమెరికన్ ప్రొఫెషన్ బాక్సర్ క్రిస్టీ మార్టిన్ బయోపిక్‌పై తీసిన క్రిస్టీలో ఆమె నటించింది.




## వన్డేల్లో తొలి శతకంతో రెచ్చిపోయిన
# ఆసీస్ కుర్రాడు

- జింబాబ్వేపై మ్యాట్ రెన్‌షా తొలి వన్డే శతకం
- 94 బంతుల్లో 109 పరుగులతో విధ్వంసం
- ఏడు ఫోర్లు.. మూడు సిక్సర్లతో మెరుపులు
- 107కే నాలుగు వికెట్లు పడినా ఆసీస్‌కు అండ
- ప్రపంచకప్ ముందు ఆరో స్థానానికి కొత్త ఆశ

**హరారే, సెప్టెంబర్ 15 (ఉద్యమ కెరటం):** టెస్టుల్లో నిరాశపరిచాడు.. వన్డేల్లో మాత్రం బ్యాట్‌తో సమాధానం చెప్పాడు! మూడేళ్ల తర్వాత టెస్టుల్లో పునరాగమనం చేసినా బంగ్లాదేశ్‌పై ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన ఆస్ట్రేలియా బ్యాటర్ మ్యాట్ రెన్‌షా.. జింబాబ్వేపై తొలి వన్డే శతకంతో చెలరేగిపోయాడు. హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో జరిగిన తొలి వన్డేలో 94 బంతుల్లో ఏడు ఫోర్లు, మూడు సిక్సర్లతో 109 పరుగులు సాధించి ఆసీస్‌కు భారీ స్కోరు అందించాడు. ఆస్ట్రేలియా టాపార్డర్ విఫలమవడంతో ఒక దశలో 107 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ సమయంలో 18వ ఓవర్‌లో ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన రెన్‌షా జింబాబ్వే బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. ఆరంభంలో పరిస్థితులకు అనుగుణంగా ఆడిన అతడు ఆ తర్వాత భారీ షాట్లతో స్కోరు వేగాన్ని పెంచాడు.

### బ్రాడ్ ఎవాన్స్ ఓవర్‌లో సెంచరీ

బ్రాడ్ ఎవాన్స్ బౌలింగ్‌లో సింగిల్ తీసి రెన్‌షా తన వన్డే కెరీర్‌లో తొలి శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. అలెక్స్ క్యారీ, ఓలీ పీకేలతో కలిసి కీలక భాగస్వామ్యాలు నెలకొల్పి జట్టును పటిష్ట స్థితికి చేర్చాడు. రెన్‌షా మెరుపులతో ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 294 పరుగులు చేసింది. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని జట్టు కూర్పుపై కసరత్తు చేస్తున్న ఆస్ట్రేలియాకు రెన్‌షా ఇన్నింగ్స్ కొత్త ఆశలు కలిగించింది. ముఖ్యంగా ఆరో స్థానంలో దూకుడుగా ఆడగల బ్యాటర్‌గా అతడు తన అవకాశాలను బలపరుచుకున్నాడు. తొలి వన్డే సెంచరీతో అదరగొట్టిన రెన్‌షా ఇక జట్టులో తన స్థానాన్ని పదిలం చేసుకుంటాడా అన్నది ఆసక్తికరంగా మారింది.

# ఆసియా క్రీడల్లో 'యంగ్ పవర్'




- వైభవ్ నుంచి అలెగ్జాండ్రా ఈలా వరకు యువ సంచలనాలు
- స్విమ్మింగ్‌లో యు జిడి.. ఒహాషిపై భారీ అంచనాలు
- జావెలిన్‌లో పతిరాగేకు స్వర్ణావకాశాలు
- జిమ్నాస్టిక్స్‌లో నిషియామా సత్తా చాటేనా?
- టెన్నిస్‌లో బంగారమే లక్ష్యంగా ఈలా బరిలోకి

**నాగోయా, సెప్టెంబర్ 15 (ఉద్యమ కెరటం):** ఆసియా క్రీడల సమరానికి జపాన్‌లోని నాగోయా-ఐచి వేదిక సిద్ధమవుతోంది. సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరగనున్న ఈ మెగా క్రీడా సంగ్రామంలో అనుభవజ్ఞులతోపాటు యువ సంచలనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభతో గుర్తింపు తెచ్చుకున్న ఆరుగురు యువ క్రీడాకారులు ఈసారి పతకాలపై కన్నేశారు. చైనా స్విమ్మర్ యు జిడి నుంచి భారత యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ, ఫిలిప్పీన్స్ టెన్నిస్ తార అలెగ్జాండ్రా ఈలా వరకు వీరి ప్రదర్శనపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

### పదమూడేళ్లకే కొలనులో సంచలనం

చైనాకు చెందిన యు జిడి అతి చిన్న వయసులోనే స్విమ్మింగ్‌లో సంచలన ప్రదర్శనలతో దూసుకొచ్చింది. 2025 ప్రపంచ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో 12 ఏళ్ల వయసులోనే 4ఐ200 మీటర్ల ఫ్రీస్టైల్ రిలేలో కాంస్యం సాధించి ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పతకం గెలిచిన అత్యంత పిన్న వయస్కురాలిగా రికార్డు సృష్టించింది. వ్యక్తిగతంగా మూడు ఈవెంట్లలో నాలుగో స్థానంలో నిలిచి త్రుటిలో పతకాలు చేజార్చుకుంది. ఈ ఏడాది మార్చిలో 200 మీటర్ల బటర్‌ఫ్లైలో అమెరికా ఒలింపిక్ ఛాంపియన్ రెగన్ స్మిత్‌ను ఓడించింది. ఆసియా క్రీడల్లో 200 మీటర్ల బటర్‌ఫ్లైతోపాటు 200, 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లేలో బరిలోకి దిగనుంది. వచ్చే నెలలో 14 ఏళ్లు పూర్తి చేసుకోనున్న యు జిడి భవిష్యత్‌లో ఒలింపిక్ స్వర్ణమే లక్ష్యంగా ముందుకెళ్తోంది.

### జావెలిన్‌లో పతిరాగే పవర్

శ్రీలంకకు చెందిన 23 ఏళ్ల రుమేష్ తరంగ పతిరాగే ఈ ఏడాది జావెలిన్ త్రోలో ప్రపంచ క్రీడాభిమానుల దృష్టిని ఆకర్షించాడు. డైమండ్ లీగ్‌లో ఛాంపియన్‌గా నిలిచిన తొలి శ్రీలంక ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. జూన్ 4న రోమ్ డైమండ్ లీగ్‌లో 92.62 మీటర్లు విసిరి అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేశాడు. గత నెల జ్యూరిచ్‌లో 92.07 మీటర్లతో మరోసారి 92 మీటర్ల మార్కును దాటాడు. ఈ ఘనతను రెండుసార్లు అందుకున్న చరిత్రలో నాలుగో ఆటగాడిగా నిలిచాడు. ఆసియా క్రీడల్లో పాకిస్థాన్ స్టార్ అర్షద్ నదీమ్ నుంచి అతడికి ప్రధాన పోటీ ఎదురుకానుంది. 92.97 మీటర్లతో ఆసియా రికార్డు నదీమ్ పేరిట ఉన్నప్పటికీ ప్రస్తుతం అతడి ఫామ్‌పై సందేహాలు ఉన్నాయి. భారత స్టార్ నీరజ్ చోప్రా గాయం కారణంగా బరిలో లేకపోవడంతో పతిరాగే స్వర్ణ పతకానికి ప్రధాన పోటీదారుగా కనిపిస్తున్నాడు.

### సొంతగడ్డపై ఒహాషి జోరు

జపాన్‌కు చెందిన 17 ఏళ్ల షిన్ ఒహాషి స్విమ్మింగ్‌లో కొత్త తరం స్టార్‌గా ఎదుగుతున్నాడు. 169 సెంటీమీటర్ల ఎత్తున్న ఒహాషి తనకు జంక్‌ఫుడ్ అంటే ఇష్టమని చెప్పడం విశేషం. అయితే కొలనులో మాత్రం అతడి వేగం ప్రత్యర్థులకు సవాల్‌గా మారుతోంది. ఈ ఏడాది 200 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్‌లో చైనా స్టార్ క్విన్ హైయాంగ్ ప్రపంచ రికార్డుకు సెకను కంటే తక్కువ తేడాతో చేరుకున్నాడు. అదే ప్రదర్శనతో జూనియర్ ప్రపంచ రికార్డును సొంతం చేసుకున్నాడు. ఇప్పుడు ఆసియా క్రీడల్లో క్విన్ హైయాంగ్‌తో మరోసారి అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నాడు.

### వైభవ్ బ్యాట్ పేలుతుందా?

భారత క్రికెట్‌లో సంచలనంగా మారిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీపై భారీ అంచనాలు ఉన్నాయి. పురుషుల టీ20 క్రికెట్‌లో ఆసియా క్రీడల టైటిల్‌ను నిలబెట్టుకోవాలని భావిస్తున్న భారత్‌కు వైభవ్ కీలక ఆటగాడిగా మారనున్నాడు.

ఐపీఎల్ 2026లో 776 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచిన వైభవ్.. ఆ ప్రదర్శనతో ఇంగ్లండ్ పర్యటనకు భారత టీ20 జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో అరంగేట్ర మ్యాచ్‌లోనే రెండు సిక్సర్లు బాదాడు. అనంతరం జింబాబ్వేపై 18 బంతుల్లో తొలి టీ20 అంతర్జాతీయ అర్ధసెంచరీ సాధించాడు. ఆ తర్వాత 49 బంతుల్లో 81 పరుగులతో మరో విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. ఇప్పుడు ఆసియా క్రీడల్లోనూ అతడి బ్యాట్ నుంచి అలాంటి మెరుపులనే అభిమానులు ఆశిస్తున్నారు.

### జిమ్నాస్టిక్స్‌లో నిషియామా మెరుపులు

జపాన్‌కు చెందిన 16 ఏళ్ల మిసా నిషియామా సీనియర్ స్థాయిలోకి అడుగుపెట్టిన వెంటనే తన ప్రతిభతో ఆకట్టుకుంది. 2025లో జూనియర్ ఫ్లోర్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన ఆమె.. ఈ ఏడాది ఏప్రిల్‌లో జపాన్ ఆల్‌రౌండ్ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. అనంతరం ఎన్‌హెచ్‌కే ట్రోఫీలోనూ స్వర్ణం సాధించింది. చిన్నతనంలో బ్రెజిలియన్ జియు--జిట్సుపై ఆసక్తి చూపిన నిషియామా ఐదేళ్ల వయసులో జిమ్నాస్టిక్స్ శిక్షణ ప్రారంభించింది. 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో మహిళల టీమ్ ఈవెంట్‌లో జపాన్‌కు పతకం అందించాలన్నది ఆమె లక్ష్యం. 1964 తర్వాత ఈ విభాగంలో జపాన్‌కు పతకం దక్కకపోవడంతో ఆమెపై భారీ ఆశలు ఉన్నాయి.

### ఈలా గురి.. ఈసారి బంగారమే

ఫిలిప్పీన్స్‌కు చెందిన అలెగ్జాండ్రా ఈలా టెన్నిస్‌లో యువ సంచలనంగా ఎదుగుతోంది. ఈ ఏడాది తొలి డబ్ల్యూటీఏ టైటిల్‌ను సాధించడంతోపాటు వింబుల్డన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఇగా స్వియాటెక్‌ను ఓడించి ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. గత నెల వాషింగ్టన్ టైటిల్ సాధించే క్రమంలో ప్రపంచ మూడో ర్యాంకర్ జెస్సికా పెగులాను ఫైనల్లో ఓడించింది. నవోమీ ఒసాకా, ఎలీనా స్విటోలినా, లేలాహ్ ఫెర్నాండెజ్, జెంగ్ క్విన్‌వెన్ వంటి ప్రముఖులపైనా విజయాలు సాధించింది. కెరీర్‌లో అత్యుత్తమంగా ప్రపంచ 18వ ర్యాంకుకు చేరుకున్న ఈలా.. గత హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో 18 ఏళ్ల వయసులోనే కాంస్యం సాధించింది. సెమీఫైనల్లో జెంగ్ చేతిలో ఓడిపోయిన ఆమె ఈసారి ఆ అనుభవాన్ని ఉపయోగించుకుని స్వర్ణం సాధించాలన్న పట్టుదలతో ఉంది. గత ఏడాది సీ గేమ్స్‌లోనూ స్వర్ణం సాధించిన ఈలా.. ఇప్పుడు ఆసియా క్రీడల బంగారంపై గురిపెట్టింది.

# ఆసియా కప్ దెబ్బకు ర్యాంకింగ్స్ తారుమారు!

- అగ్రస్థానంలో తెలుగమ్మాయి శ్రీ చరణి
- 804 పాయింట్లతో మరింత పటిష్టం
- రెండో ర్యాంకుకు దూసుకెళ్లిన దీప్తి శర్మ
- బ్యాటింగ్‌లో షెఫాలీకి ఆరో స్థానం
- ర్యాంకింగ్స్‌లో భారత అమ్మాయిల జోరు




**దుబాయ్, సెప్టెంబర్ 15 (ఉద్యమ కెరటం):** ఆసియా కప్ గెలిచిన జోష్‌లో ఉన్న భారత మహిళల క్రికెట్ జట్టు.. అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌లోనూ సత్తా చాటింది. మహిళల ఆసియా కప్--2026లో అద్భుతంగా రాణించిన భారత క్రికెటర్లు తాజా ర్యాంకింగ్స్‌లో గణనీయమైన పురోగతి సాధించారు. ముఖ్యంగా తెలుగమ్మాయి ఎన్. శ్రీ చరణి బౌలింగ్‌లో అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసుకోగా.. దీప్తి శర్మ రెండో స్థానానికి దూసుకెళ్లింది. శ్రీలంకతో జరిగిన ఆసియా కప్ ఫైనల్లో శ్రీ చరణి నాలుగు కీలక వికెట్లు పడగొట్టి భారత విజయంలో ప్రధాన పాత్ర పోషించింది. టోర్నీ ఆసాంతం నిలకడగా రాణించిన ఆమె అంతర్జాతీయ టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో 800 రేటింగ్ పాయింట్ల మార్కును అధిగమించింది. ప్రస్తుతం 804 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతూ తన ఆధిపత్యాన్ని మరింత బలపరుచుకుంది. ఈ ప్రదర్శనతో కెరీర్‌లో మరో అరుదైన మైలురాయిని అందుకున్న శ్రీ చరణి.. భారత మహిళల క్రికెట్‌లో ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకుంది. ఆసియా కప్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో ఒకరిగా నిలిచిన దీప్తి శర్మ కూడా ర్యాంకింగ్స్‌లో భారీగా పురోగమించింది. నాలుగు స్థానాలు ఎగబాకి రెండో ర్యాంకును కైవసం చేసుకుంది. దీంతో టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో తొలి రెండు స్థానాల్లో భారత బౌలర్లే నిలవడం విశేషం. బ్యాటింగ్ విభాగంలో షెఫాలీ వర్మ ఒక స్థానం మెరుగుపరుచుకుని ఆరో ర్యాంకుకు చేరుకుంది. ఆసియా కప్‌లో పరుగుల వరద పారించిన షెఫాలీ.. కీలక మ్యాచ్‌ల్లో దూకుడైన బ్యాటింగ్‌తో భారత్‌కు బలంగా నిలిచింది. స్మృతి మంధాన ఐదో స్థానంలో కొనసాగుతుండగా.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ పదో స్థానంలో నిలిచింది. ఆల్‌రౌండర్ల విభాగంలోనూ షెఫాలీ వర్మ దూసుకెళ్తూ కెరీర్‌లో అత్యుత్తమ రేటింగ్ పాయింట్లను అందుకుంది. ఆసియా కప్ ట్రోఫీని సొంతం చేసుకోవడమే కాకుండా.. బ్యాటింగ్, బౌలింగ్, ఆల్‌రౌండ్ విభాగాల్లో భారత క్రీడాకారిణులు అగ్రస్థానాల వైపు దూసుకెళ్లడం టీమిండియా ఆధిపత్యాన్ని చాటుతోంది.

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
బుధవారం
16 సెప్టెంబర్ 2026



# నయనతార కంబ్యాక్ ఇస్తుందా?

## 'మహాశక్తి'పైనే ఆశలు!

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (ఉద్యమ కెరటం) :** తనదైన లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో సౌత్ ఇండియాలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న లేడీ సూపర్ స్టార్ నయనతార, ప్రస్తుతం విజయం కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇటీవల వచ్చిన 'టాక్సిక్', 'హాయ్' చిత్రాలు ఆశించిన స్థాయి లో మెప్పించలేకపోవడంతో ఆమె సక్సెస్ ట్రాక్ కాస్త మందగించింది. యష్ సరసన 'టాక్సిక్' లో అక్క గంగ పాత్రలో కనిపించినా, కవిన్‌తో చేసిన ఫీల్ గుడ్ ఎంటర్టైనర్ 'హాయ్' రొటీన్ కథతో కమర్షియల్ బూస్ట్ ఇవ్వలేకపోయాయి. దీంతో వరుసగా రెండు పరాజయాల తర్వాత ఆమె నటిస్తున్న 'మహాశక్తి' సినిమాపై అంచనాలతో పాటు తీవ్రమైన ఒత్తిడి కూడా నెలకొంది. గతంలో 'మూకుతి అమ్మన్' (తెలుగులో 'అమ్మోరు తల్లి') చిత్రంలో అమ్మవారి పాత్రలో నయనతార మెప్పించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే ఫ్రాంచైజీకి సీక్వెల్‌గా 'మూకుతి అమ్మన్ 2'ను తెలుగు ప్రేక్షకులకు 'మహాశక్తి' పేరుతో అందిస్తున్నారు. సుందర్ సి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం డివైన్ ఫ్యాంటసీ, యాక్షన్, భారీ వీఎఫ్ఎక్స్ తో రూపుదిద్దుకుంటోంది. రెజీనా విలన్‌గా, దునియా విజయ్, యోగిబాబు, ఊర్వశి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. టీజర్ విజువల్స్ ఆకట్టుకున్నప్పటికీ, కథా బలంతో పాటు విఎఫ్ఎక్స్ క్వాలిటీయే ఈ సినిమా భవితవ్యాన్ని తేల్చనున్నాయి. మరి ఈ భక్తిరస ఫ్యాంటసీ చిత్రంతో నయనతార గ్రాండ్ కంబ్యాక్ ఇస్తుందో లేక హ్యాట్రిక్ డిజాస్టర్ ఆమె ఖాతాలో చేరుతుందో వేచి చూడాలి.

# కిరీటం మిస్సయినా.. 'గూగుల్'లో మళ్లీ బిజీ!

### విధుల్లో చేరిన మిస్ యూనివర్స్ ఇండియా ఫైనలిస్ట్

### గూగుల్ క్లౌడ్‌లో ఇంజనీర్‌గా ఉమాంగ్ కుమావత్

**బెంగళూరు, సెప్టెంబర్ 15 (ఉద్యమ కెరటం):** ఇటీవల జైపూర్‌లో ముగిసిన 'మిస్ యూనివర్స్ ఇండియా 2026' అందాల పోటీల్లో ఫైనలిస్ట్‌గా నిలిచిన ఉమాంగ కుమావత్ మళ్లీ తన దినచర్యలో బిజీ అయిపోయారు. పోటీల్లో టైటిల్ దక్కకపోయినా ఆ బాధను పక్కనపెట్టి, బెంగళూరులోని గూగుల్ క్లౌడ్ (+శీశీస్త్రశ్రీవ జశ్రీశీబ) ఆఫీస్‌లో ఐటీ ఇంజనీర్‌గా తన విధుల్లో తిరిగి చేరారు. సెప్టెంబర్ 14న ఆమె సోషల్ మీడియాలో పంచుకున్న 'డే ఇన్ మై లైఫ్' వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. ఆఫీస్‌లో పనిచేయడం, వెల్‌నెస్ సెంటర్‌లో వర్కవుట్లు, కాఫీ బ్రేక్స్ వంటి దృశ్యాలతో కూడిన ఈ వీడియో చూసి ఆఫీస్ సహచరులు, నెటిజన్లు ఆమె ఆత్మవిశ్వాసాన్ని అభినందిస్తున్నారు.

ఇదిలా ఉండగా, జైపూర్‌లోని జీ స్టూడియోలో జరిగిన 'మిస్ యూనివర్స్ ఇండియా 2026' గ్రాండ్ ఫినాలేలో కేరళకు చెందిన 19 ఏళ్ల కజియా లిజ్ మెజో విజేతగా నిలిచారు. దేశవ్యాప్తంగా పోటీపడిన 52 మంది సుందరీమణులను వెనక్కి నెట్టి కజియా ఈ టైటిల్‌ను సొంతం చేసుకోగా, మాజీ మిస్ యూనివర్స్ ఇండియా మనిక విశ్వకర్మ ఆమెకు కిరీటాన్ని అలంకరించారు. ఈ పోటీల్లో మధ్యప్రదేశ్ రాష్ట్రం తరఫున ప్రతినిధ్యం వహించిన గూగుల్ ఇంజనీర్ ఉమాంగ కుమావత్, టైటిల్ సాధించలేకపోయినా కార్పొరేట్ లైఫ్‌కు తిరిగొచ్చి అందరి చేత శభాష్ అనిపించుకుంటున్నారు.








# 2న ప్రేక్షకుల ముందుకు 'అనకాపల్లి' చిత్రం!

భవ్య శ్రీ మూవీ మేకర్స్ మరియు నక్కిన నెరేటివ్స్ పతాకాలపై అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న రా అండ్ రస్టిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'అనకాపల్లి' సినిమా విడుదలకు సర్వం సిద్ధమైంది. అక్టోబర్ 2వ తేదీన ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రంలో నటుడిగా, నిర్మాతగా ప్రముఖ దర్శకుడు త్రినాథరావు నక్కిన మరియు కాంద్రేగుల నాయుడు కీలక పాత్రలు పోషిస్తూ నిర్మాణ బాధ్యతలు కూడా నిర్మించారు. విక్రమ్ సహిదేవ్, సంధ్యా వశిష్ట, తారక్ పొన్నప్ప ప్రధాన తారాగణంగా నటిస్తున్న ఈ సినిమాకు ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహించారు. కాంద్రేగుల కుమార్ రాజా కో-ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తూ, కథ మరియు స్క్రీన్‌ప్లే రూపకల్పనలో తన వంతు సహకారం అందించారు.

# వినాయక చవితికి 'ఫీల్ మై లవ్' స్పెషల్ ట్రీట్

## ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసిన చిత్రబృందం




**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (ఉద్యమ కెరటం):** వినాయక చవితి సందర్భంగా 'ఫీల్ మై లవ్' చిత్రబృందం ప్రేక్షకులకు ప్రత్యేక కానుక అందించింది. శ్రీ లక్ష్మీ జ్యోతి క్రియేషన్స్ పతాకంపై నిర్మాత బాలాజీ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రం నుంచి వినాయక చవితి ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో ప్రధాన తారాగణమంతా కనిపించేలా రూపొందించిన పోస్టర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోందని చిత్రబృందం పేర్కొంది. యువతతోపాటు కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ప్రేమ, కామెడీ, భావోద్వేగాల సమాహారంగా ఈ ఫీల్‌గుడ్ చిత్రాన్ని దర్శకుడు హరి ప్రకాష్ తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ పోస్టర్‌కు మంచి స్పందన లభించిందని, తాజాగా పండుగ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయని మేకర్స్ తెలిపారు. ఆదిత్య భాస్కర్, ఐరా, అమ్ము అభిరామి ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా.. మధుసుదన్‌రావు, రాజయ్యప్ప, నోబెల్ జేమ్స్, ప్రియాంక తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. కథతోపాటు విజువల్స్‌కు ప్రాధాన్యం ఇస్తూ చెన్నై, పుదుచ్చేరి, మున్నార్, కొడైకెనాల్ వంటి సుందరమైన ప్రదేశాల్లో కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. లొకేషన్లు, ఛాయాగ్రహణం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని చిత్రబృందం ధీమా వ్యక్తం చేసింది. సినిమా ప్రచార కార్యక్రమాలను భారీ స్థాయిలో నిర్వహించేందుకు మేకర్స్ ప్రణాళిక సిద్ధం చేశారు. త్వరలో ఆడియో విడుదల వేడుక వైభవంగా నిర్వహించనున్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో భారీ ఎత్తున ప్రచార కార్యక్రమాలు చేపట్టి ప్రేక్షకులను నేరుగా కలవాలని నిర్ణయించారు.

# టాలీవుడ్‌కు గుడ్ బై

## అను ఇమ్మాన్యుయేల్ సంచలన నిర్ణయం

**హైదరాబాద్:** నాని హీరోగా వచ్చిన 'మజ్ను' చిత్రంతో టాలీవుడ్‌లో అడుగుపెట్టి, పవన్ కళ్యాణ్, అల్లు అర్జున్ వంటి అగ్ర కథానాయకుల సరసన నటించిన మలయాళ బ్యూటీ అను ఇమ్మాన్యుయేల్ సినిమాలకు తాత్కాలికంగా గుడ్‌బై చెప్పినట్లు వార్తలు వస్తున్నాయి. అందం, అభినయం ఉన్నప్పటికీ కెరీర్ ఆశించిన స్థాయిలో సాగకపోవడం, వరుస పరాజయాలు ఎదురుకావడంతో ఆమె పరిశ్రమకు దూరమవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. భారత్‌ను వీడి తన స్వస్థలమైన అమెరికాలోని చికాగోకు శాశ్వతంగా వెళ్లిపోయినట్లు టాలీవుడ్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. నాలుగేళ్ల క్రితం అల్లు శిరీష్ సరసన 'ఊర్వశివో రాక్షసివో' చిత్రంలో బోల్డ్ పాత్రలో మెప్పించినప్పటికీ ఆమెకు ఆశించిన అవకాశాలు రాలేదు. ఆ తర్వాత తమిళంలో కార్తి సరసన చేసిన 'జపాన్' చిత్రం కూడా డిజాస్టర్ కావడంతో అవకాశాలు పూర్తిగా సన్నగిల్లాయి. మెగా కాంపౌండ్‌లోని పలువురు హీరోలతో కలిసి నటించినా కాలం కలసి రాలేదు. అమెరికాలోనే పుట్టి పెరిగిన అను ఇమ్మాన్యుయేల్, అక్కడ తన కుటుంబంతో కలిసి ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని భావిస్తున్నట్లు సమాచారం. కాగా, రష్మిక మందన్న ప్రధాన పాత్రలో వచ్చిన 'ది గర్ల్‌ఫ్రెండ్' ఆమె చివరి తెలుగు చిత్రంగా నిలిచింది.



Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: 9030717172, 9391127717